

● నిజాంపట్నం వద్ద 100 మీటర్లపైనే ముందుకు వచ్చి ఎగిసిపడుతున్న సముద్రం



● చుట్టుగుంట సెంటర్‌లో మురికిపేటలో నిలిచిన వర్షపునీరు



వణికించిన మొంథా

మొంథా.. వణికించింది. మంగళవారం రాత్రికి తీరం దాటగా.. అంతకు ముందు.. ఆ తర్వాత జిల్లాలో ఆ ప్రభావం తీవ్రంగా కనిపించింది. మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఆ తర్వాత ఒక్కసారిగా మారిపోయింది. అప్పటి వరకు వర్షం పడినా ఆ తర్వాత నుంచి మేఘాలు కమ్ముకు వచ్చి ఈదురు గాలులతో వర్షం పడింది. సాయంత్రానికి గాలులతోపాటు వర్షం కూడా తీవ్రమైంది. పల్నాడు జిల్లాలో కూడా మొంథా ప్రభావం చూపగా.. సముద్రతీరంలోని బాపట్ల జిల్లాను వణికించింది. గుంటూరు జిల్లాలో కూడా తుఫాన్ ప్రభావం కనిపించింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో బుధవారం కూడా విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలు, గుడిసెల్లోని ప్రజలను అధికారులు పునరావాస కేంద్రా లకు తరలించారు. పంటలు నీటిలో నానుతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తుఫాన్ తీరం దాటినా ఆ ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



నిడుబ్రోలు హైస్కూల్‌లోని పునరావాస కేంద్రంలో బాధితులు



వడ్డేశ్వరం పునరావాస కేంద్రం వద్ద బాధితులతో కలెక్టర్ అన్సారియా



రేపల్లె: పల్లపట్లలో గాలులకు పూరిగుడిసెపై విరిగిపడ్డ కొబ్బరిచెట్టు

- ఈదురు గాలులు.. ఓ మోస్తరు వర్షం
- ఉదయం నుంచి కమ్ముకున్న చీకట్లు
- తీరప్రాంత మండలాల్లో అల్లకల్లోలం
- హార్బర్‌లో 8వ ప్రమాద హెచ్చరిక

గుంటూరు, తెనాలి, రేపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరాన్ని వణికిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కమ్ముకొచ్చిన మేఘాలతో చీకట్లు అలుముకున్నాయి. వానకు గాలులు కూడా తోడయ్యాయి. ఇక సముద్ర తీర ప్రాంతంలో 50 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులతో తీరప్రాంత మండలవాసులు భయాందోళనకు గురవుతున్నారు. విరామమిస్తూ, ఒక్కొక్కసారి వర్షం విరుచుకు పడుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు వాన నీటితో నిండిపోయాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. తుఫాన్ తీవ్రత విషయంలో అధికారుల హెచ్చరికలతో తీరానికి దూరంగా ఉన్న పల్నాడు, గుంటూరు జిల్లా పరిధిలోని పట్టణాల్లో కూడా ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. బాపట్ల జిల్లా పరిధిలోని తీర ప్రాంత సమీప గ్రామాలతో పాటు, బాపట్ల, చీరాల, రేపల్లె తదితర పట్టణాల్లో కూడా ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే ఉన్నారు.

ఇక పలు ప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. కొన్ని మండలాల్లో వరి నెలవాలి నీటిలో నానుతుంది. పత్తి, మిరప పొలాలు నీటిలో నానుతున్నాయి. సాయంత్రం నుంచి ప్రారంభమైన ఈదురు గాలులతో అక్కడక్కడ భారీ వృక్షాలు నెలకూలాయి. తుఫాన్ తీవ్రత దృష్ట్యా నిజాంపట్నంలో 8వ ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు. సోమవారం అంతా మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తే, మంగళశారం ఉదయానికి ఐదో ప్రమాద హెచ్చరిక, మధ్యాహ్నానికి 8వ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. తీర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. తీరానికి (మిగతా 6వ పేజీలో)

సముద్రం ముందుకొచ్చింది..

మొంథా తుఫాన్ తీరానికి దగ్గరవుతున్న కొద్దీ సముద్రంలో అలజడులు ఎక్కువయ్యాయి. అలలు ఎగిసిపడుతున్నాయి. నిజాంపట్నం హార్బర్ వద్ద మంగళవారం ఉదయానికి సముద్రం 100 మీటర్లు ముందుకు రాగా, క్రమంగా పెరుగుతూ సాయంత్రానికి 150 మీటర్ల వరకు ముందుకొచ్చింది. చాలావరకు ఒడ్డుకు ఆనుకున్నట్లు కనిపించింది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రళయం సంభవిస్తుందోనని నిజాంపట్నం, నిజాంపట్నం హార్బర్, దిండి తదితర తీరప్రాంతంలోని గ్రామాల్లోని ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారు. హోరు శబ్ధాలతో ప్రజలంతా వణికిపోతున్నారు. బీచ్‌ల వద్ద నిషేధం కొనసాగుతుండటంతో ఆ పరిసర ప్రాంతాలు కర్ఫ్యూను తలపిస్తున్నాయి.



● పేరేచర్ల పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

వర్షం.. ఈదురు గాలులు

● ఆకస్మిక వరదలపై హెచ్చరికలు జారీ

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుపాను జిల్లాపై మంగళవారం రాత్రి నుంచి తీవ్ర ప్రభావం చూపింది. గుంటూరులో వర్షం, గాలుల ప్రభావం పెరిగింది. ఫ్లాష్ ఫ్లడ్స్(ఆకస్మిక వరదలు), 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరికలు జారీ చేసింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు తుఫాన్ ప్రభావం జిల్లాపై అంతగా లేదు. ఉదయం నుంచి రాత్రి ఏడు గంటల వరకు 12 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. ఆ తర్వాత బలమైన ఈదురుగాలులతో జిల్లావ్యాప్తంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. అయితే ముందుగానే జాగ్రత్తలు తీసుకొని ఉన్న అధికారులు అరగంట వ్యవధిలోనే విద్యుత్ సరఫరాని పునరుద్ధరించారు. గాలి తీవ్రత కారణంగా నగరంలో మంగళవారం రాత్రి 9 గంటల నుంచి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శివారు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలు పడటంతో ట్రాన్స్‌ఫార్మర్లలో ఫీజులు ఎగిరిపోయాయి. డీ6, డీ 12 పరిధిలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేని వర్షాలతో తెనాలి పట్టణం, గ్రామాల్లో జన జీవనం స్థంభించింది. గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పర్యటించి కొమ్మలను తొలగింపజేశారు. ఫ్లెక్సీ హోర్డింగ్‌లు కూడా తొలగించారు. పొన్నూరు ప్రాంతంలో మంగళవారం ఉదయం నుంచి ఈదురు గాలులు వీచాయి. అయితే అంతగా వర్షం లేదు. అయినా ఈదురు గాలులు అధికంగా వీచడంతో వరి పైరు నేలకు ఒరిగింది. పలు గ్రామాల్లో వాణిజ్య పంటలు తమలపాకు, అరటి తోటలకు నష్టం తప్పదని సాగుదారులు వాపోతున్నారు.



బాపట్ల : గాలులకు విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం

తుపాను సహాయక చర్యల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంని ఏర్పాటు చేశారు. నంబరు. 08632234014కి ఫోన్ చేసి ఎలాంటి సహాయం అయినా పొందవచ్చని కలెక్టర్ అన్సారియా ప్రకటించారు. ఏదైనా విపత్కర పరిస్థితులు సంభవించినా ప్రజలు వెంటనే ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు.



ప్రత్తిపాడు పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



కాకుమాను పునరావాస కేంద్రంలో అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



చేబ్రోలు: శేకూరు-వీరనాయకునిపాలెం మధ్య కరెంట్ తీగలపై కూలిన తాటిచెట్టు



తుఫాన్ ప్రభావంతో ఖాళీగా దర్శనమిస్తున్న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్



నిజాంపట్నంరోడ్డులో విద్యుత్ స్థంభాలు ఏర్పాటు



నిజాంపట్నంహార్బర్ వద్ద బోటులో మత్స్యకారులు

గుంటూరు రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్కు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో మంగళవారం రాత్రి గాలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో గుంటూరు, రేపల్లె రైల్వేస్టేషన్లలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారు. రైల్వేలోని అన్ని విభాగాల వార్ రూంలలో సీనియర్ అధికారులు అందుబాటులో ఉంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు సమీక్షిస్తున్నారు. రద్దు చేసిన రైళ్ల మినహా మిగతా రైళ్లపై అర్ధరాత్రి వరకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు రైల్ వికాస్ భవన్‌లోనే రాత్రి ఉండి రైల్వేస్టేషన్లలో పరిస్థితులను పర్యవేక్షించారు.

రీఫండ్ కౌంటర్లు ఏర్పాటు

తుపాను కారణంగా పలు రైళ్లను రద్దు చేసిన దృష్ట్యా ఇదివరకే వాటిలో టిక్కెట్లు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులకు నగదు వాపసు చేసేందుకు గుంటూరు రైల్వేస్టేషన్‌లో అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు. హెడ్‌క్వార్టర్స్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికులు ఆయా కౌంటర్లకు వెళ్లి నగదుని వాపసు చేసుకోవచ్చని రైల్వే ప్రజా సంబంధాల అధికారి వినయ్‌కాంత్ తెలిపారు.

అధికారులు అప్రమత్తం

- జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ సుడిగాలి పర్యటన
- లోలెవల్ చప్టాలు, పునరావాస కేంద్రాల పరిశీలన

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందన్న హెచ్చరికలు.. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉన్నట్టుండి మారిన వాతావరణం.. ఈదురు గాలుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. పునరావాస కేంద్రాల పరిశీలనతో పాటు లో లెవల్ చప్టాల వద్ద, కాల్వల్లో నీటి ప్రవాహాలను పరిశీలించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత గుంటూరులోని పునరావాస కేంద్రాలతో పాటు బుడంపాడు, తాడికొండ లాం, అమరావతి రాజధాని, మంగళగిరి, మేడికొండూరు తదితర మండలాల్లో పర్యటించారు. భారీ వర్షం కురిస్తే లోలెవల్ చప్టాల వద్ద ప్రమాదకర స్థాయిలో వరదనీరు ప్రవహించే అవకాశం ఉండటంతో వాటి వద్ద జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుడంపాడు పీకలవాగు అవుట్‌పాల్ డ్రెయిన్‌లో వరద ప్రవాహాన్ని పరిశీలించారు. డ్రెయిన్ పొడవునా అడ్డంకులు లేకుండా ఎక్స్‌కవేటర్లతో తొలగించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఫ్యాన్లు సక్రమంగా పని చేసేలా చూడాలన్నారు. తాడికొండ మండలం లాంవాగులో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. తుళ్లూరులో ఆర్‌వీఆర్ సంస్థ కార్మికుల తాత్కాలిక వసతి కేంద్రాలను పరిశీలించారు. తుపాను గాలుల నేపథ్యంలో తాత్కాలిక షెడ్లకు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున కార్మికులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ఆదేశించారు. మంగళగిరి మండలంలోని ఆత్మకూరు, ఇప్పటం, తాడేపల్లిలోని వడ్డేశ్వరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులతో సౌకర్యాలపై కలెక్టర్ మాట్లాడారు. మేడికొండూరులో లోలెవల్ చప్టాని కూడా కలెక్టర్ పరిశీలించారు. సిరిపురం, పాలడుగులోని పునరావాస కేంద్రాలను సందర్శించారు. కలెక్టర్ ఆదేశాలతో వ్యవసాయ కూలీలను సిరిపురం జడ్పీ హైస్కూలుకు తరలించారు. మరోవైపు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెనాలి డివిజన్‌లో సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలిసి పునరావాస కేంద్రాలను సందర్శించారు. మంగళగిరి మండలంలోని ఆత్మకూరులోని పునరావాస కేంద్రంలో బాధితులకు దుప్పట్లు, తినుబండారాలను పంపిణీ చేశారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రెడ్ అలర్ట్‌తో కలెక్టర్ సమీక్ష

తుపాను తీవ్రతను అంచనా వేసిన ఏపీఎస్‌డీఎంఏ రాత్రి 8.15 గంటల సమయంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. రెడ్ అలర్టుని ప్రకటించింది. అర్ధరాత్రి వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని, ఎవరూ బయటకు రావొద్దని కోరింది. దీంతో కలెక్టర్ అన్సారియా వెంటనే టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వాగులు, వంకలు ఎవరూ దాటకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెట్లు కూలితే వెంటనే తొలగించాలన్నారు. ఏమాత్రం జాప్యం చేయకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వాళ్లందరిని పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.

విండ్‌షియర్ ప్రభావంతోనే గాలి తీవ్రత

తుపాను చుట్టూ విండ్ షియర్ చాలా ఎక్కువగా ఉంది. ఈ కారణంతోనే గాలి తీవ్రత పెరగడం, దిశ మారడం జరిగింది. తుపాను ప్రభావం గోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉంటే గాలి తీవ్రత మాత్రం గుంటూరులో అధికంగా నమోదైంది. వర్షపు మేఘాల పట్టీలు తుపానుకు దూరంగా ఉండిపోయాయి. దీని వల్ల గుంటూరు జిల్లాపై గాలి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొన్నది. అలానే వర్షం కూడా కొన్ని ప్రాంతాల్లో మధ్యస్థ నుంచి భారీగా కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

తుఫాన్‌పై ఎస్పీ సమీక్ష

- పోలీస్ కంట్రోల్ నంబర్ : 112
- అత్యవసర సహాయానికి : 0863 - 2230100

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా తుఫాన్ పరిస్థితులపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున విద్యుత్ స్తంభాల వద్ద, చెట్ల కింద లేదా ఓపెన్ ప్రదేశాల్లో ఉండరాదన్నారు. మొబైల్ ఫోన్ వాడకాన్ని తగ్గించాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు పోలీస్, రెవెన్యూ సిబ్బంది సూచనలను తప్పక పాటించాలన్నారు. నీటిమునిగిన రహదారులపై వాహనాలు నడపరాదన్నారు. అత్యవసర పరిస్థితి, ప్రమాదం లేదా సహాయం అవసరమైన సందర్భంలో వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ లేదా ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలన్నారు. ప్రమాదకర వాగులు, వంతెనలు, కాల్వ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వరదలు, రహదారుల పరిస్థితిపై నిఘా కోసం డ్రోన్ సేవలు సిద్ధంగా ఉంచాలన్నారు. తుఫాన్ సమయంలో సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల ద్వారా నిర్ధారణ లేని వార్తలు, వదంతులు పంచుకోవద్దన్నారు. అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో ఎస్పీ పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న వసతులపై ఆరాతీశారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు పరిధిలోని వాగులు, రహదారులు, వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశించారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలం గరికపాడు, పొన్నూరు మండలం వల్లభరావుపాలెంలో పునరావాస కేంద్రాల్లో బాధితులకు భోజనం వడ్డించి, పండ్లు, బ్రెడ్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.



పునరావాస కేంద్రంలో మందులను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా మంగళవారం పలు రైళ్లు రద్దయ్యాయి. కొన్నింటిని దారి మళ్లించి దక్షిణ మధ్య రైల్వే నడిపింది. 07060 అనకాపల్లి - సికింద్రాబాద్, 17255 నరసపూర్ - లింగంపల్లి, 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి, 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ, 22876 గుంటూరు - విశాఖపట్టణం, 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 17281 గుంటూరు - నరసపూర్, 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ, 12704 సికింద్రాబాద్ - హౌరా ఫలక్‌నూమా, 17243 గుంటూరు - రాయగడ, 07165 హైదరాబాద్ - భువనేశ్వర్ స్పెషల్, 17215 మచిలీపట్నం - ధర్మవరం, ఈ నెల 29వ తేదీ బుధవారం 17244 రాయగడ - గుంటూరు, 17216 ధర్మవరం - మచిలీపట్నం, 18464 బెంగళూరు - భువనేశ్వర్ ప్రశాంతి, 17256 లింగంపల్లి - నరసపూర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. 12703 హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ని విజయనగరం నుంచే టిట్లాగడ్, రాయిపూర్, బలార్ష, బెల్లంపల్లి, కాజీపేట మీదగా సికింద్రాబాద్‌కు మళ్లించారు. 18048 వాస్కోడిగామా - షాలిమార్ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని 12 గంటల ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు. వీటితో పాటు గుంటూరు - తెనాలి - రేపల్లె, గుంటూరు - విజయవాడ మధ్యన ప్రయాణించే ప్యాసింజర్లలో కొన్నింటిని రద్దు చేశారు.

పలు బస్సు సర్వీసులు రద్దు

● ఆర్టీసీ ఆదాయంపై తీవ్ర ప్రభావం


వెలవెలబోతున్న ఎన్టీఆర్ బస్టాండ్

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీపై మొంథా తుపాను ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. అడపా దడపా వర్షంతో జిల్లాలో పలు సర్వీసులు సగం మంది ప్రయాణికులతోనే రాకపోకలు సాగించాయి. రెండు రోజులుగా గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ ప్రయాణికులు లేక బోసిపోతోంది. బుధవారం పూర్తిగా తుపాన్ ప్రభావం పడనున్న నేపథ్యంలో ఆర్టీసీ యంత్రాంగం అప్రమత్తమైంది. గుంటూరు ప్రజా రవాణాధికారిగా (డీపీటీవో) సోమవారం బాధ్యతలు స్వీకరించిన డి.సామ్రాజ్యం వెను వెంటనే తుపాను ప్రభావంపై రూట్‌ల వారీగా సమీక్షించారు. డీపీటీవో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గుంటూరు-1, 2, మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లో కూడా సర్వీసులను తగ్గిస్తున్నట్లు డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. తుపాను ప్రభావంతో ప్రజలు కూడా ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారని, తద్వారా రద్దీ ఉండటం లేదని దాంతో సర్వీసులను తగ్గిస్తున్నట్లు చెప్పారు. అమరావతి, తెనాలి, బాపట్ల, పర్చూరు, మాచర్ల వంటి మార్గాల్లో రహదారుల పరిస్థితి, చప్టాల వద్ద వరద పరిస్థితులను అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా కొన్ని సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ ఆదాయంపై మొంథా తుపాను ప్రభావం పూర్తి స్థాయిలో కనిపిస్తోంది. మరో రెండు రోజులు చార్జీల రూపంలో ఆర్టీసీ ఆదాయానికి గండిపడనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అమ్మవారి ఆభరణాలు దొంగిలించిన పూజారి


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉమేష్

తెనాలి క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర మండలం హనుమాన్ పాలెంలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయంలో రూ.20 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను ఆలయ పూజారే దొంగిలించాడు. మంగళవారం తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సీఐ ఆర్.ఉమేష్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. దేవస్థానంలో పూజారిగా జయరామశర్మ రెండేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. అమ్మవారికి భక్తితో భక్తులు బంగారు వడ్డాణం, బంగారపు రాళ్ల గాజులు తదితర రూ.20 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు సమర్పించారు. ఈ ఆభరణాలను పూజారి ఒక్కొక్కటిగా తీసుకెళ్తూ.. వాటి స్థానంలో బంగారపు మెరుగు అద్దిన ఆభరణాలను ఉంచాడు. దాతలకు పూజా సమయంలో అనుమానం రావడంతో.. వాటిని పరిశీలించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణలో ఆ బంగారు ఆభరణాలను పూజారి ఇంటిలో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. కొల్లిపర ఎస్‌ఐ కోటేశ్వరరావు, సిబ్బంది రామకోటేశ్వరరావు, శివరామకృష్ణను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


నవీన్(ఫైల్‌ఫొటో)

మాచవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వేమవరం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన రెంటపాళ్ళ నవీన్(19) పెయింటర్‌గా పని చేస్తుంటాడు. ఉదయం ఓ గృహంలో పెయింట్ పనిచేస్తుండగా.. కింద పడి ఉన్న కరెంటు వైరుపై చూసుకోకుండా కాలు పెట్టాడు. వైరు తెగి ఉండడంతో.. షాక్‌కు గురైన నవీన్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అతనిని తరలించగా.. వైద్యులు పరీక్షలు నిర్వహించి నవీన్ మరణించినట్లు నిర్ధారించారు. ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఎస్‌ఐ విజయ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంధువుల నుంచి వివరాలు సేకరించారు.

దూర విద్య పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, సైకాలజీ, మ్యాథమెటిక్స్, ఏంసీఏ పరీక్ష ఫలితాలను సంచాలకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు మంగళవారం విడుదల చేశారు. విద్యార్థులు రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 11 లోపు దరఖాస్తు చేసుకోవాలని, పేపర్‌కు రూ.960 ఫీజు చెల్లించాలని తెలిపారు. దరఖాస్తులను వచ్చే నెల 15 లోపు దూరవిద్య పరీక్షల సమన్వయకర్తకు పంపాలన్నారు.

భర్తను చంపి సాధారణ మరణంగా చిత్రీకరించిన భార్య

పోస్టుమార్టం నివేదికతో ఐదు నెలలకు వెలుగు చూసిన హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, వెనుక నిందితురాలు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తన ఏ సోఫా దిండుతో అయితే భర్త చంపాలనుకున్నాడో.. అదే దిండుతో భార్య తన భర్తను ఊపిరాడకుండా చేసి అంతమొందించింది. దానిని సాధారణ మరణంగా చిత్రీకరించి.. అంత్యక్రియలు కూడా పూర్తి చేసింది. అయితే కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో.. నాలుగు నెలల తర్వాత హత్య విషయం వెలుగులోకి వచ్చింది. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, కేసు వివరాలు వెల్లడించారు. నేతాజీ నగర్ 6వ లైనుకు చెందిన షేక్ ఖాజా, హజార భార్యభర్తలు. వారికి అమ్మాయి, అబ్బాయి సంతానం. ఫైనాన్స్ వ్యాపారం, హజార గుజ్జన గుండ్ల సెంటర్‌లో బ్యూటీ పార్లర్ నడుపుతోంది. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గత జూన్ 19న రాత్రి ఖాజా మద్యం సేవించి తన సంపాదన అంతా భార్య ఖర్చు చేస్తుందని గొడవ పడ్డాడు. భార్య హజారాను కర్రతో కొట్టి, చున్నీతో ఆమె మెడ కేసి బిగించాడు. సోఫాలో కూర్చుని ఉండగా మరోసారి దిండుతో ఆమె ముఖంపై గట్టిగా అదిమి ఆ తర్వాత వదిలేశాడు. ఖాజా ఇంటిలోని మెయిన్ బెడ్ రూంలో భార్యను దుర్భాషలాడాడు. దీంతో హజారా తన భర్తతో విసుగు చెంది, అతను పెట్టే బాధలు భరించలేక భర్తను చంపేయాలని నిర్ణయించుకుంది. రాత్రి సోఫాలో ఉన్న దిండును తీసుకుని బెడ్ రూంలో నిద్రపోతున్న ఖాజా చాతి మీద బలంగా గుద్ది, నెట్టింది. మత్తులో ఉన్న భర్త మంచం మీద వెనక్కి పడిపోగా హజారా సోఫా దిండుతో ఖాజా ముఖం మీద గట్టిగా అదమడంతో.. ఊపిరి ఆడక అతను చనిపోయాడు. అనంతరం హజారా ఏమి తెలియనట్టు.. కిందకు వెళ్లి పక్క వీధిలోని ఆర్ఎంపీకి, చుట్టపక్కల వారికి..ఖాజా ఉన్నట్లుండి పడిపోయాడ ని, ఏమి జరిగిందో తెలియడం లేదని చెప్పింది. తరువాత రోజు హజార భర్త మృతదేహానికి అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమైంది. కుటుంబ సభ్యులు ఖాజా మరణంపై జూన్ 20న పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక మేరకు సోమవారం రాత్రి ఖాజాను చంపిన హజరాను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె నేరం అంగీకరించడంతో.. సీఐ గంగా వెంకటేశ్వర్లు నిందితురాలిని అరెస్ట్ చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

ప్రేమ పేరుతో దగ్గరైన మైనర్లు

● బాలుడిపై పోక్సో కేసు నమోదు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మైనర్ బాలికపై బాలుడు అత్యాచారానికి పాల్పడిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. కోబాల్ట్ పేటకు చెందిన 17 ఏళ్ల బాలికను.. అదే ఏరియాకు చెందిన అదే వయసు గల బాలుడు జనవరి నుంచి ఇన్‌స్టాగ్రాంలో చాటింగ్ చేసుకుంటున్నారు. ఇద్దరూ ప్రేమ పేరుతో దగ్గరయ్యారు. గత జూన్‌లో బాలిక మైనర్ బాలుడు ఇంటికి వెళ్లింది. ఇద్దరూ శారీరకంగా దగ్గరయ్యారు. ఇలా పలుమార్లు జరిగింది. ఈ క్రమంలో బాలిక గర్భందాల్చింది. దీంతో మంగళవారం బాలిక కుటుంబ సభ్యులకు వ్యవహారం తెలియడంతో పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి.. బాలికను మెడికల్ పరీక్ష నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

వైసీపీ కళ్లలో ఆనందం కోసమే జడ శ్రావణ్ వ్యాఖ్యలు

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్


మాట్లాడుతున్న తమ్మిరెడ్డి శివశంకర్

మంగళగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయ స్వలాభం కోసం జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ హెచ్చరించారు. మంగళవారం మంగళగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జై భీం పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021 జనవరిలో మత్స్యకార కుటుంబానికి చెందిన ముమ్మల నగేష్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి హత్య జరిగితే ఇప్పుడు బురదజల్లే కార్యక్రమం చేయడం ఎవరి మెప్పు కోసమని ప్రశ్నించారు. రణస్థలంలో జరిగిన యువశక్తి కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. ఈ కేసును వైసీపీ నాయకులు నీరుగార్చడానికి ప్రయత్నిస్తే పోరాడి హైకోర్టులో కేసు వేసింది జనసేన పార్టీయేనన్నారు. ఏపీ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులపై వందల సంఖ్యలో దాడులు, హత్యలు జరిగితే ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేరు మారిన.. ఔరంగబాద్ రైల్వేస్టేషన్

● ఛత్రపతి శంభాజీనగర్‌గా మార్పు

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఔరంగబాద్ రైల్వేస్టేషన్ పేరుని రైల్వే శాఖ మార్పు చేసింది. ఛత్రపతి శంభాజీనగర్ రైల్వే స్టేషన్‌గా వాడుకలోకి తీసుకొచ్చింది. స్టేషన్ కోడ్ కూడా సీపీఎస్ఎన్‌గా నిర్ణయించింది. ఈ కారణంగా ప్రస్తుతం గుంటూరు - ఔరంగబాద్ మధ్యన ప్రయాణిస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక నుంచి గుంటూరు - ఛత్రపతి శంభాజీ నగర్‌గా పేర్లు మారాయి. నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ప్యాసింజర్లు ఈ మార్పుని గమనించాలని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

యథావిధిగా నేడు జడ్పీ సమావేశం

● ఏర్పాట్లను పరిశీలించిన సీఈఓ

గుంటూరు సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం యథావిధిగానే జరుగుతుందని జడ్పీ సీఈఓ వి.జ్యోతి బసు వెల్లడించారు. మొంథా తుపాను నేపథ్యంలో సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తారు అన్న ప్రచారం జరిగిన నేపథ్యంలో సీఈఓ స్పందించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సమావేశం వాయిదా వేయాలంటే జడ్పీటీసీలు ఆమోదం తెలుపుతూ లేఖ ఇవ్వాలని వెల్లడించారు. వారి నుంచి నుంచి ఏ విధమైన విజ్ఞప్తి అందలేదని తెలిపారు. కాబట్టి ప్రకటించిన రీతిగానే సమావేశం జరుగుతుందని స్పష్టం చేశారు. సమావేశ మందిరంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

అధికారుల హాజరు సందిగ్ధం

ఉమ్మడి గుంటూరు జిల్లాల అధికార యంత్రా ంగం మొంథా తుపాను సహాయ చర్యల్లో నిమగ్నం అయ్యింది. ముఖ్యంగా గుంటూ రు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారు లు క్షణం తీరిక లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా అధికారులు సమావేశానికి హాజరు కావడం కష్టమని తెలుస్తోంది.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి


ప్రమాద ఘటనలో జయపాల్

ఫిరంగిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములూరిపాడు గ్రామం శివారు దర్గా వద్ద మంగళవారం ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొనడంతో.. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల మేరకు.. బొప్పూడి జయపాల్ అనే వ్యక్తి బైక్‌పై గుంటూరు నుంచి స్వగ్రామం కొండవీడుకు వెళ్తుండగా నరసరావుపేట నుంచి వస్తున్న లారీ అతనిని ఢీకొంది. దీంతో జయపాల్ లారీ ముందు భాగంలో ఇరుక్కుపోయాడు. ఫిరంగిపురం ఎస్‌ఐ నవీన్, ఏఎస్‌ఐ జా న్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ రత్నరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వణికించిన మొంథా

(5వ పేజీ తరువాయి)

దూరంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం గాలుల తీవ్రత ఎక్కువగా కనిపించింది. మంగళవారం రాత్రికి మొంథా తీరం దాటే సమయంలో తీవ్రత పెరిగితే 10వ ప్రమాద హెచ్చరిక పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రేపల్లె, నిజాంపట్నం, కర్లపాలెం, బాపట్ల, చీరాల పరిధిలోని తుఫాన్ ప్రభావిత గ్రామాల నుంచి జనాన్ని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గుంటూరు జిల్లాలోని కృష్ణానదీ తీరంలోని కొల్లిపర, దుగ్గిరాల తోపాటు, తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు వంటి పట్టణాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వర్షం తక్కువగా ఉన్నా, గాలుల తీవ్రత పెరగడంతో విద్యుత్ సరఫరాకు చాలాచోట్ల అంతరాయం ఏర్పడింది. విరిగి పడిన చెట్ల కొమ్మలను, పడిపోయిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ సిబ్బంది వర్షంలోనూ ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వర్షాలు, గాలులతో పంటలకూ నష్టం తప్పడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలోని తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, చుండూరు, అమృతలూరు వంటి మండలాల్లో అక్కడక్కడ వరి చాపలా నేలపై పరుచుకుపోయింది. లంక గ్రామాల్లోని అరటి, కంద, పసుపు వంటి తోటలు నేలవాలాయి. మంగళవారం రాత్రికి తీరం దాటే నేపథ్యంలో సాయంత్రం నుంచి గాలుల తీవ్రత పెరిగింది. తుఫాన్ పరిస్థితుల దృష్ట్యా దక్షిణ కోస్తా జోన్‌కు ప్రత్యేక అధికారిగా నియమించిన ఆర్‌పీ.సిసోడియా మంగళవారం బాపట్ల కలెక్టరేట్‌కు వచ్చి ఏర్పాట్లపై సమీక్షించారు.

నాగార్జున సాగర్ నీటి నిల్వ 306 టీఎంసీలు

విజయపురిసౌత్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 588.00 అడుగులు ఉంది. ఇది 306.10 టీఎంసీలకు సమానం. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,683, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 33,283 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 34,663 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

0.9841 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ రెండు యూనిట్ల ద్వారా సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9841 ఎంయూల విద్యుత్‌ను తయారుచేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను 1.50 మీటర్లు, ఒక గేట్ 2 మీటర్లమేర ఎత్తి 24,116 క్యూసెక్కులు, టేల్ రేస్ చానల్ ద్వారా 8675 క్యూసెక్కులు మొత్తంగా 32,791 క్యూసెక్కుల నీటిని పులచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 33,657 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. ప్రాజెక్టులో 75.50 మీటర్లమేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని పేర్కొన్నారు.

డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేత

తాడేపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 82,675 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా డెల్టా కాలువలకు నీటి విడుదల నిలిపివేసినట్టు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

119 పునరావాస కేంద్రాలకు 5,407 మంది


సూర్యలంక సముద్ర తీరంలోని తుపాను షెల్టర్

బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో ప్రాణ నష్టం జరగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 119 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాలకు 5,407 మంది నిరాశ్రయులను తరలించారు. వారికి భోజన సదుపాయం కల్పించారు. జనరేటర్లు ఏర్పాటు చేశారు. సూర్యలంక సముద్ర తీరంలోని తుపాన్ షెల్టర్ పునరావాస కేంద్రంలో తీరం వెంబడి గిరిజన కుటుంబాలను ఉంచారు. ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని మంగళవారం డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ సందర్శించారు. విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు ఆప్రాంతాన్ని పరిశీలించి, విద్యుత్ సమస్య తలెత్తకుండా సిబ్బందికి సూచించారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు తీరంలో భద్రతా చర్యలు చేపట్టారు. సముద్రానికి ప్రజలు రాకుండా ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు. జమ్ములపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రంలో జేసీఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ, గ్రామకార్యదర్శి మరియమ్మతో కలిసి నిరాశ్రయులకు భోజన ఏర్పాట్లు చేశారు.

కొండవీటి వాగు పరివాహక.. ప్రాంతాలను పరిశీలించిన ఏడీసీ బృందం


కొండవీటి వాగును పరిశీలిస్తున్న ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి

తుళ్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో ఎగువ నుంచి కొండవీటి వాగుకు వరద నీటి తాకిడి ఉన్నందున అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరక్టర్ డి.లక్ష్మీపార్థసారథి మంగళవారం కొండవీటి వాగు పరివాహక ప్రాంతాలను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎగువ నుంచి కొండవీటి వాగులో నీటి ఉధృతి పెరిగే క్రమంలో ప్రవాహానికి ఎక్కడా అంతరాయం కలుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా కొండవీటివాగు దాటుకొని వెళ్లే నీరుకొండ, కురగల్లు, ఎన్-6 పశ్చిమ బైపాస్, ఈ-10 రహదార్ల వద్ద వాగు వొంపులుగా ఉన్న ప్రదేశాల్లో అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ప్రధానంగా అమృత విశ్వ విద్యాలయం వద్ద ప్రవాహం తీరు వేగంగా జరిగే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలవాగు కొండవీటి వాగులో కలిసే కృష్ణాయపాలెం వద్ద స్వీయపరిశీలన జరిపారు. కొండవీటి వాగు కృష్ణా నదిలో కలుస్తున్న ఉండవల్లి ఇరిగేషన్ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. వరద నీటి ఎత్తిపోత పరిస్థితిని సమీక్షించారు. కొండవీటి వాగు పరివాహక ప్రాంతంలో ఇంజినీర్లు అనుక్షణం వరద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో ఈఎన్‌సీ ఆర్.గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజినీర్లు బి.నరసింహమూర్తి, సిహెచ్.ధనుంజయ, ఇంజినీరింగ్ బృందం పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో డీఎస్పీల జంట పూజలు


వేదాశీర్వచనం పొందిన డీఎస్పీలు

అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డీఎస్పీలు ప్రేమించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక్కటైన జంట మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా అవనిగడ్డ డీఎస్పీగా పనిచేస్తున్న విద్యశ్రీ, పల్నాడు జిల్లా గురజాల డీఎస్పీగా పనిచేస్తున్న జగదీష్ గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరుపెద్దల అంగీకారంతో వారు ఒక్కటయ్యారు. వారికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయగా దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఒకే క్యాడర్ పోలీస్ అధికారుల ప్రేమ వివాహం విశేషంగా మారింది.

14 ఏఓ, 28 మంది డిప్యూటీ ఎంపీడీఓలకు పదోన్నతులు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. 14 మంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, 28 మంది డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, డిప్యూటీ ఎంపీడీఓలకు పదోన్నతులు దక్కాయి. రాయలసీమ ప్రాంతంలో ఖాళీలు లేకపోవడంతో పలువురిని కృష్ణా, ఏలూరు, గోదావరి జిల్లాల్లో పదోన్నతులపై బదిలీ చేశారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి డిప్యూటీ ఎంపీడీఓ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల ఖాళీలను పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1 ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి భర్తీ చేస్తారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ఆరుగురు కన్సల్టెంట్లు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ అర్బన్-2.0 అమలుకు రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ సర్వీసెస్ ఇన్‌క్లూజివ్(ఎన్ఐసీఎస్ఐ) ఎంప్యానెల్ చేసిన ఏజెన్సీ ద్వారా ఆరుగురు కన్సల్టెంట్లను నియమించుకునేందుకు మున్సిపల్ శాఖ అనుమతించింది. వీరిని 12 నెలల పాటు నియమించుకోవడానికి అనుమతిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ ఆ మేరకు చర్యలు తీసుకోవాలని, వారికి వేతనాలు ఎన్ఐసీఎస్ఐ ఆమోదించిన రేట్ల ప్రకారం ఉండేలా చూడాలని సూచించింది. వారి వేతనాల కోసం చేసే వ్యయం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషనన్ స్వచ్ఛభారత్ మిషన్ నిధుల నుంచి భరిస్తారు.

ఎంఎస్ఈలకు రూ.10 కోట్ల అదనపు నిధులు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (సీజీఎస్-ఎంఎస్ఈ) పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి కార్పస్ ఫండ్ చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు అదనపు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

సమగ్ర కులగణనకు పూనుకోవడం హర్షణీయం

● బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని బీసీ సమాజం హర్షిస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా బీసీ సంఘాల పోరాట ఫలితంగా జాతీయ స్థాయిలో జనగణనతో పాటే సమగ్ర కులగణనకు మోదీ ప్రభుత్వం ముందుకు రావడాన్ని బీసీల చారిత్రాత్మక విజయంగా భావిస్తున్నామని తెలిపారు. నవంబరు 7 నుంచి సమగ్ర కులగణన నిర్వహించేందుకు సిద్ధపడిన సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. సుప్రీంకోర్టు చెప్పిన విధంగా 50 శాతం పరిమితిని అధిగమించేందుకు పార్లమెంటుచే రాజ్యాంగ సవరణ చేయించి, షెడ్యూల్డ్-9లో పెట్టించాలని శంకరరావు కోరారు.

116 పునరావాస కేంద్రాలు

● 7265 మంది తరలింపు ● భోజన సదుపాయాలు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. పటిష్టంగా ఉన్న జిల్లాపరిషత్తు హైస్కూళ్లు, గ్రామ, వార్డు సచివాలయాల భవనాలు, ఫంక్షన్ హాల్స్‌లో వీటిని ప్రారంభించింది. తుపాను కారణంగా కూలిపోయే అవకాశం ఉన్న కచ్చా ఇళ్లు, నీట మునిగే ప్రమాదం ఉన్న లోతట్టు ప్రాంతాలను అధికారులు గుర్తించి అక్కడ నివాసం ఉంటున్న వారిని కేంద్రాలకు తరలించారు. అక్కడ నాణ్యమైన భోజనాన్ని బాధితులకు అందిస్తున్నారు. పునరావాస కేంద్రాలు దూరంగా ఉన్న ప్రాంతాల్లో అయితే ఆర్టీసీ బస్సులు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి తీసుకొచ్చారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృతంగా పర్యటిస్తూ పునరావాస కేంద్రాలను సందర్శించి అక్కడి ప్రజలకు ధైర్యం చెప్పారు.

జిల్లాలో మొత్తం 13,240 కచ్చా గృహాలను గుర్తించారు. ఎక్కువగా గుంటూరు నగరంలో 2699, పొన్నూరులో 1167, తెనాలిలో 1047 ఉన్నాయి. వాటిల్లో 13,887 కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు లెక్కించారు. తాత్కాలికంగా 596 ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేశారు. 51 చోట్ల కట్టడాలు కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు గ్రహించారు. గుంటూరు నగరంలో 25, దుగ్గిరాలలో 10, తుళ్లూరులో 10, ప్రత్తిపాడులో 4, వట్టిచెరుకూరులో 4, పెదనందిపాడులో 3, గుంటూరు తూర్పులో 1, గుంటూరు పశ్చిమలో 2, ఫిరంగిపురంలో 1, మేడికొండూరులో 4, తాడికొండలో 1, పెదకాకానిలో 4, చేబ్రోలులో 4, పొన్నూరులో 8, తెనాలిలో 1, కొల్లిపరలో 4, కాకుమానులో 6, మంగళగిరిలో 5, తాడేపల్లిలో 8, ఎంటీఎంసీలో 4, తెనాలి టౌన్‌లో 6, పొన్నూరు టౌన్‌లో 1 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటన్నింటిలోకి మంగళవారం సాయంత్రానికి 7265 మందిని తరలించి భోజన సదుపాయాలను కల్పించారు. ఎక్కువగా గుంటూరు నగరంలో 1840, పొన్నూరులో 650, తాడేపల్లిలో 502 మందిని సెంటర్స్‌కు తీసుకొచ్చారు.

కాగా ఉదయం నుంచి జిల్లాలో పలుచోట్ల జోరుగా వర్షం కురిసింది. అలానే ఈదురుగాలులు కూడా వీచాయి. ఎక్కువగా రహదారులపై బలంగా గాలులు వీచినట్లు వాహనదారులు తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్టణం జిల్లాలతో పాటు ఒడిస్సా రాష్ట్రానికి బయలుదేరి వచ్చిన సిమెంట్ లోడు లారీలు ఎన్‌హెచ్-5పై ఏటుకూరు బైపాసు వద్ద పార్కింగ్ స్థలాల్లో నిలిపేశారు. ఇతర సరుకుల వాహనాలను కూడా సురక్షిత ప్రాంతాల్లో పార్కింగ్ చేశారు. తుపాను గండం గడిచాక తాము బయలుదేరి వెళతామని ఆయన వాహనాల డ్రైవర్లు తెలిపారు.



కాకాని రోడ్డులో ఎస్ఎస్‌ను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసబాబు తదితరులు

విద్యుత్ వ్యవస్థపై మొంథా తుఫాన్ ఎఫెక్ట్

● తెనాలి డివిజన్‌లో విద్యుత్ అంతరాయాలు

● కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ సరఫరాపై మంగళవారం మొంథా తుఫాన్ ప్రభావం చూపింది. గుంటూరు సర్కిల్ తెనాలి డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. ముఖ్యంగా తెనాలి డివిజన్ పరిధిలోని కొల్లిపర ప్రాంతాల్లో ఈదురు గాలులు, వర్షంతో వృక్షాలు నేలకొరిగి విద్యుత్ తీగలు, పోల్స్ నేలకొరగటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తెనాలి డివిజన్ ఈఈ అక్కల సత్యనారాయణ క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. బాపట్ల డివిజన్ పరిధిలోనూ ఈదురు గాలులతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించేందకు చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రం గుంటూరులో ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా గుంటూరు టౌన్-1 ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు చర్యలు చేపట్టారు. విద్యుత్ అంతరాయాలు తలెత్తినా వెంటనే పునరుద్ధరించేలా క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మొంథా తుఫాన్‌పై విద్యుత్‌శాఖ ఆపరేషన్- మెయింట్‌నెన్స్ (ఓ అండ్ ఎమ్) అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దాంతో గుంటూరు సర్కిల్ కార్యాలయం సంగడిగుంట విద్యుత్ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ తెలిపారు. ప్రజలు విద్యుత్ పరమైన సమస్యలపై కంట్రోల్ రూమ్ నెంబరు 9440817526కు లేదా టోల్ ఫ్రీ నెంబరు 1912ను సంప్రదించాలని సూచించారు. స్టోర్స్‌లో విద్యుత్ పోల్స్, కండక్టర్స్ ట్రాన్స్‌ఫార్మర్స్ అందుబాటులో ఉంచారు. అలానే పునరుద్ధరణ పనులకు సిబ్బందిని కేటాయించారు. విద్యుత్ పోల్స్ తీగెలు తెగిపడిపోయినా, ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి శబ్దం వచ్చినా ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు.

ప్రభుత్వ చర్యలు అభినందనీయం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి

గుంటూరు (తూర్పు) అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలు ప్రశంసనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. స్థానిక మిర్చియార్డు, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా నిలబడుతుందని, ధైర్యంగా ఉండాలని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ, కేవీ సుబ్బారావు, చిరకా కుమార్ గౌడ్, వైవీ సుబ్బారావు, ఏలూరి లక్ష్మి బాదం శ్రీనివాస్, తోట గోపి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న చెరుకూరి తిరుపతిరావు, పాల్గొన్న బీజేపీ నాయకులు

హైవేపై అడ్డంకులు తొలగింపు

పెదకాకాని,అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి: పెదకాకాని సెంటర్ సమీపంలో హైవేపై ఒక భవనం అడ్డంగా ఉంది. దీంతో హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మే 29వ తేదీన ఆంధ్రజ్యోతి గుంటూరు జిల్లా సంచికలో 'ఆ ప్రాంతం.... యమ డేంజర్' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు నేషనల్ హైవే అథారిటీ, వివిధ శాఖల అధికారులు నివేదికలు తెప్పించుకొని పరిశీలించారు. దీంతో ఆ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉందని గ్రహించిన అధికారులు, హైవేకి అడ్డంకిగా ఉన్న ఆ భవనానికి ఉన్న అడ్డంకులు తొలగించారు. దీనిపై పెదకాకాని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెదకాకాని సెంటర్ సమీపంలో హైవేపై భవన అడ్డంకులను తొలగిస్తున్న అధికారులు

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు : మేయర్



బొంగరాలబీడులోని పునరావాస కేంద్రంలో చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వలన నగర ప్రజలు ఇబ్బంది పడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెస్తే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి బొంగరాలబీడులోని వెంగమాంబ సత్రం, మిర్చియార్డ్ రైతు విశ్రాంతి భవనంలో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి, వసతులు, ఏర్పాట్లపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తుఫాన్ ని ఎదుర్కోవడానికి జీఎంసీ ఆధ్వర్యంలో విస్తృత చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యమంత్రి పిలుపు మేరకు ప్రస్తుత విపత్కర పరిస్తితుల్లో కూటమి నాయకులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పునరావాస కేంద్రాల్లో సమగ్ర మౌలిక వసతులు కల్పించి, ఆహారం, త్రాగునీరు అందించడం జరుగుతుందని, ఎక్కడా లోపాలు తలెత్తకుండా నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, తుఫాన్ నేపధ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 74 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిలో ప్రస్తుతం 17 వందల మంది ఉన్నారని మంగళవారం రాత్రికి వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే వార్డ్ ల వారీగా నోడల్ అధికారులను అప్రమత్తం చేశామని, అధికారులు, సచివాలయ కార్యదర్శులకు సెలవులు రద్దు చేశామని తెలిపారు. ఎక్కడ సమస్య తలెత్తినా తక్షణం జిఎంసి కమాండ్ కంట్రోల్ రూమ్ కి సమాచారం అందించాలని సూచించారు. జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తుఫాన్ రక్షణ చర్యల్లో ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో కృషి చేస్తుందన్నారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్లు బీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ కీలకం : మేయర్

ఇబ్బంది వస్తే 0863-2345103, 9849908391కు ఫోన్ చేయండి

తుఫాన్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అధికారులకు సమన్వయం చేయడంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది షిఫ్ట వారీగా ఓర్పుతో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను స్వీకరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం మొంథా తుఫాన్ సన్నద్ధతకు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కమిషనర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అందే ఫిర్యాదులను క్షేత్ర స్తాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదు తప్పనిసరిగా రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా పునరావాస కేంద్రాలకు వస్తున్న ప్రజల వివరాలు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నివేదికలను అదనపు కమిషనర్ సమీక్షించి చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ కారణంగా అధికవర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, వర్షాల వలన ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్లకు 0863-2345103, 9849908391 ఫోన్ చేయాలన్నారు. మేయర్ వెంట అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఇన్‌చార్జ్ ఎస్ఈ సుందరరామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి తుఫాన్‌పై పర్యవేక్షిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ తదితరులు

హైటెక్ వ్యభిచార గృహం గుట్టు రట్టు

● పోలీసుల అదుపులో ఇద్దరు నిర్వాహకులు సహా 11 మంది

● విటులలో మహారాష్ట్ర, యూపీ, పశ్చిమ బెంగాల్, అస్సాం యువతులు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : హైటెక్ వ్యభిచారం గుట్టును నల్లపాడు పోలీసులు రట్టు చేశారు. గోరంట్ల సమీపంలోని హోసన్నా మందిర్ ఎదురు రోడ్డులో ఓ ఇంటిలో గుట్టుగా సాగుతున్న హైటెక్ వ్యభిచార ముఠాను మంగళవారం నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్తంభాలగరువుకు చెందిన మాగంటి ఉమాదేవి టైలరింగ్ పనిచేసేది. కొంతకాలంగా ఆమె ఖమ్మం జిల్లా పినపాక మండలం వీరాపురం గ్రామానికి చెందిన పోలబోయిన కళ్యాణితో కలిసి హోసన్న మందిర్ ఎదురు రోడ్డులో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని వ్యభిచార గృహం నిర్వహిస్తోంది. ఈ వ్యభిచార గృహం సమాచారం అందుకున్న నల్లపాడు పోలీసులు మంగళవారం ఆ ఇంటిపై దాడి చేయగా ఇరువురు నిర్వాహకులు సహా 11 మంది పట్టుపడ్డారు. మహారాష్ట్ర, యూపీ, పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలకు చెందిన వారితో పాటు బొంగరాలబీడు, చినపలకలూరు గ్రామాలకు చెందిన మహిళలు కూడా పట్టుబడ్డారు. అలాగే విశదల, గుజ్జనగుండ్ల ప్రాంతాలకు చెందిన ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఏడాది జైలు

● లేదా రెండు లక్షల 43 వేల జరిమానా

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యానికి పాల్పడిన కేసులో పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన భాగం పెద్ద కొండలుకు ఏడాది జైలు, లేదంటే రూ.2 లక్షల 43 వేల జరిమాన విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. 2022 జూన్ 18న ఎలక్ట్రిసిటీ విజిలెన్స్ సీఐ శివశంకర్ ఆదేవిధంగా, ఎలక్ట్రిసిటీ ఏఈ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా పెద్ద కొండలు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు తేలింది. దీంతో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రస్తుతం ఎలక్ట్రిసిటీ విజిలెన్స్ సీఐ వెంకన్న చౌదరి సాక్షులను కోర్టు ఎదుట హాజరుపరిచారు. కేసు విచారణ అనంతరం పెద్ద కొండలు విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు మెజిస్ట్రేట్ నిర్ధారించారు. దీంతో పెద్దకొండలుకు ఏడాది జైలు లేదంటే రెండు లక్షల 43 వేల రూపాయల జరిమానా చెల్లించాలంటూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిసిటీ విజిలెన్స్ సీఐ వెంకన్న చౌదరి మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడకుండా మీటర్ బిగించుకొని సక్రమంగా విద్యుత్ వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరం అన్నారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుంటే 9440811789 నెంబర్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



బుడంపాడు పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలను పరామర్శిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



బుడంపాడు వద్ద వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



పట్నం బజార్లో బురదమయమైన ఒక వీధి



పల్నాడు బస్టాండులో నిలిచిన వర్షపు నీరు



మూడు వంతెనల వద్ద సిద్ధంగా ఉన్న మోటార్లు



వ్యాపారులు లేక ఖాళీగా కూర్చున్న వ్యాపారులు



హిమని సెంటర్ వద్ద వర్షంలోనే రోజువారి పనుల కోసం ఎదురుచూస్తున్న కార్మికులు



మిర్చి యార్డు పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలు



ఖాళీగా ఉన్న మార్కెట్ సెంటర్



నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నసీర్

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ ● నియోజకవర్గంలో పర్యటన

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎవరూ భయపడాల్సిన పనిలేదని, అన్నివిధాలుగా తాము అండగా ఉంటామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ప్రజలకు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. తుఫాన్ నేపథ్యంలో అందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అత్యవసరమైతేనే బయటికి రావాలని సూచించారు. కాలువలను పరిశీలించి ఎప్పటికప్పుడు సిల్టు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వరద ప్రభావిత ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. చిన్న పిల్లలను బయటకు పంపించవద్దని సూచించారు. ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని చెప్పారు. మంచినీరు కాచి తాగాలని, చెట్ల కింద ఉండకూడదని సూచించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. విద్యుత్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలని, స్తంభాలు, వైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.



పునరావాస కేంద్రాల్లో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

అన్ని సదుపాయాలు కల్పించాలి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని మిర్చి యార్డు, స్తంబాల గరువు పుల్లయ్య మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలను పరామర్శించారు. పునరావాస కేంద్రాలలో సౌకర్యాలను ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులను అవసరమైన సూచనలు చేశారు. తుఫాన్ తగ్గిన వెంటనే డీసిల్టేషన్ మరియు డ్రైనేజ్ క్లీనింగ్ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పటికే ఆర్‌టీబీ పనుల కారణంగా ఏర్పడిన ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి పోలీస్ విభాగంతో సమీక్ష జరిపామని, ప్రజలు అవసరం అయితే తప్ప బయటికి రావొద్దని, వర్షాలు ఉన్నంతవరకు ప్రజలు నీటిని కాచుకుని వడపోసి తాగాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

గుంటూరు (విద్య) అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు యూటీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు రాజశేఖర్, ఎం కళాధర్ తదితరుల ఆధ్వర్యంలో స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన శిబిరంలో కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటమే కాకుండా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఒకవైపు పోరాటం చేస్తూనే, మరొకవైపు ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడిన ప్రతి సందర్భంలోనూ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జీ.వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శులు ఎం.గోవిందు, బెల్లంకొండ ప్రసాదు, ఎండీ షకీలా బేగం ఎం.కోటిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ బీ.ఆదిలక్ష్మి నగర కమిటీ సభ్యులు ఎం.చిన్నయ్య, నరసింహారావు, ఎంవి శివ రామిరెడ్డి, హరి ప్రసాద్, హనీఫా జిల్లా కార్యవర్గ సభ్యులు బురాన్, గోపయ్యనయీమ్, షాజీర్, కొండవీటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రభుత్వం ప్రజల్ని ఆదుకుంటుంది

● జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న తరుణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నిరంతర పర్యవేక్షణలో ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. మంగళవారం 22వ డివిజన్ పరిధిలోని పీకలవాగు, వేణుగోపాలపురంతో పాటూ లోతట్టు ప్రాంతాలను కూటమి నాయకులు, సచివాలయం సిబ్బందితో కలిసి పర్యటించారు. భారీ వర్షాలు కురిస్తే పీకలవాగు పొంగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోట చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలకు అచ్చయ్యడాబా సెంటర్లోని డీపీ ఫంక్షన్ హాల్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆహారం, తాగునీరు, పాలు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు.

కూతురు వరసైన యువతిపై అత్యాచారయత్నం

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూతురు వరుసైన యువతిపై మారు తండ్రి అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లాకు చెందిన 25 సంవత్సరాల వయసు గల యువతికి, కొన్ని సంవత్సరాల క్రితం ఆమె మేనమామతో వివాహం జరిగింది. వారికి ఒక అమ్మాయి ఒక అబ్బాయి సంతానం ఉన్నారు. నాలుగు సంవత్సరాలుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడివిడిగా ఉంటున్నారు. బాధితురాలు తన పిల్లలతో కలసి తన తల్లి వద్దనే ఉంటుంది. అయితే బాధితురాలి తల్లి భర్తకు దూరంగా ఉంటూ మరొకరితో సహజీవనం చేస్తోంది. అయితే తల్లి ఇంటిలో లేని సమయంలో సోమవారం రాత్రి బాధితురాలు ఒంటరిగా ఇంట్లో ఉండగా ఆమె మారు తండ్రి బాబు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుంటూరు బొంగరాల బీడు పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న ప్రజలు


బుడంపాడు పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా


దుగ్గిరాల: ఈమని పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా

ఏ మొంథా నష్టం జరగకుండా..


నిజాంపట్నం హార్బర్‌లో జెట్టీలకే పరిమితమైన మెరైన్ బోట్లు


రేపల్లె: పెనుమూడి వద్ద ఈదురు గాలులకు ఊగిపోతున్న కొబ్బరి చెట్లు


కొల్లిపర : మున్నంగి సమీపంలో పడిపోయిన కంద

మొంథా తుపాను ప్రభావం గుంటూరు, బాపట్ల జిల్లాల్లో స్పష్టంగా కనిపించింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమై.. మంగళవారం ఉదయం నుంచే ముందస్తు చర్యలు తీసుకుంది. తీర ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి భోజన, వైద్య సదుపాయాలను కల్పించారు. కలెక్టర్లు కేంద్రాలకు చేరుకుని ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై విరిగిపడిన చెట్లను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించి.. ఇబ్బందులు తలెత్తకుండా చేశారు. విద్యుత్ సిబ్బంది నిరంతరం స్పందిస్తూ విద్యుత్ అంతరాయాలను నిరోధించారు. పోలీసు సిబ్బంది వాగులు, బీచ్‌ల వద్ద ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా బందోబస్తు నిర్వహించారు. గ్రామ స్థాయి వరకు అధికారులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు. మొత్తంగా ఏమంత నష్టం జరగకుండా పగడ్బందీ ముందస్తు చర్యల్లో అధికార యంత్రాంగం సఫలమైందనే చెప్పాలి.

- ఆంధ్రజ్యోతి, గుంటూరు


నరసరావుపేట: రోడ్డుపై విరిగి పడిన చెట్టును తొలగిస్తున్న రూరల్ ఎస్‌ఐ కిషోర్


మంగళగిరి పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న జేసీ శ్రీవాస్తవ

బాధ్యత గల పౌరులుగా ఎదగండి

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి

తుళ్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను పూర్తి చేసిన ప్రతి విద్యార్థి సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి పిలుపునిచ్చారు. జాతి నిర్మాణం, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం పెరగాలని కోరారు. మంగళవారం ఉదయం నీరుకొండలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 5వ స్నాతకోత్సవంలో డాక్టర్ మధుమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూనివర్సిటీ కులపతి డాక్టర్ టీఆర్ పారివేందర్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో మధుమూర్తి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎస్ఆర్ఎం వంటి అంతర్జాతీయ స్థాయి వర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విజనరీ 'రోడ్ మ్యాప్' తో ముందుకు సాగుతోందన్నారు. ఎంతో శక్తివంతమైన గూగుల్ ఏఐ డేటా సెంటర్ విశాఖకు మంజూరు కావడం ఎంతో గొప్ప విషయం అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తరఫున స్నాతకోత్సవానికి తాను హాజరయ్యానని.. విద్యార్థులకు ఆయన తన అభినందనలను మెసేజ్ ద్వారా పంపారని వివరించారు. యూనివర్సిటీ ఫౌండర్ చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి విజనరీ లీడర్ అన్నారు చంద్రబాబునాయుడు కోరిక మేరకే ఏపీలో యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు విశ్వవ్యాప్తంగా ఎక్కడైనా మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ డిగ్రీలు అందుకున్న విద్యార్థులు వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. శాంతి సహనంతో విజయ సోపానాలు అధిరోహించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్ వార్షిక నివేదికను సమర్పించారు. 2020-25 విద్యా సంవత్సరంలో బీటెక్, పీహెచ్‌డీ, బీఏ, బీకాం చదువులు పూర్తి చేసుకున్న 1,877 మంది విద్యార్థులకు డిగ్రీలు, ఇందులో ప్రతిభ గల విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు అనంతరం విద్యార్థులతో కులపతి పారివేందర్ ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం ట్రస్ట్ సభ్యురాలు మణిమంగై, ఎస్ఆర్ఎం గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.నారాయణరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ డీన్‌లు డాక్టర్ విష్ణుపత్, వినాయక కల్లూరి, డాక్టర్ ఎన్వి రమణరావు, డాక్టర్ రంజిత్ పాల్గొన్నారు.



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న విద్యామండలి చెర్మన్ ముధుమూర్తి

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.



శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబానో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి

దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పునరావాస కేంద్రాల్లో కలెక్టర్ సందర్శన


వడ్డేశ్వరం పునరావాస కేంద్రం వద్ద కలెక్టర్ అన్సారియా

తాడేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలంలోని వడ్డేశ్వరం, రాధారంగా నగర్, ఇప్పటం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం సందర్శించారు. పునరావాస కేంద్రాల వద్ద ఉన్న ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడి పలు విషయాలు తెలుసు కున్నారు. ఇప్పటం పునరావాస కేంద్రంలో 64 మంది ఉండగా అక్కడ కేవలం రెండు టాయ్‌లెట్స్ మాత్రమే ఉండడంతో ఆమె అధికారులతో మాట్లాడి పునరా వాస కేంద్రానికి ఎదురుగా ఉన్న కల్యాణ మండపం టాయ్‌లెట్స్‌ను వాడుకునే విధంగా ఆదేశాలు జారీ చేశారు. అధికారులు, సిబ్బంది కూడా నిత్యం అప్రమత్తతతో ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఫిర్యాదులొస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు మరో సబ్‌కలెక్టర్ సంజనా సింహ, తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య, ఎంటీఎంసీ డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మేడికొండూరులో కలెక్టర్ పర్యటన

మేడికొండూరు: మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పేరేచర్లలోని పునరావాస కేంద్రానికి వెళ్లి ఇక్కడ పరిస్థితులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట డీపీవో బీవి నాగ సాయికుమార్, తహసీల్దార్ రాఘవరావు ఎంపీడీవో డేవిడ్ ప్రభాకర్ ఈవోపిఆర్‌డి పూర్ణ శంకర్రావు, పీఆర్ జేఈ అజయ్ కుమార్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

● సిరిపురం వెళ్తూ మార్గమధ్యంలో లాం వద్ద కొండవీటి వాగు చప్టాను కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు.


లాం వద్ద కొండవీటి వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అధికార యంత్రాంగం అప్రమత్తం

● తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన జేసీ అశుతోష్


మంగళగిరి కొత్తపేటలో కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ

మంగళగిరి సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఆయన తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహాతో కలిసి మంగళగిరి పట్టణం, మండలంలో పర్యటించి ముందస్తు సహాయక చర్యలను పర్యవేక్షించారు. పునరావాస కేంద్రాలను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, పారిశుధ్యం, తాగునీరు, భోజనం వంటి మౌలిక వసతులను కల్పించాలని, కేంద్రాల్లో ఉన్న పిల్లలకు పాలు, అల్పాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికార యంత్రాంగానికి ప్రజలు సహకరించి పునరావాస కేంద్రాలకు తరలిరావాలని కోరారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 0863-2234014 ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతోపాటు డివిజన్, మండల స్థాయిల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలు ఇంటి వద్దనే ఉండాలని, నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈదురు గాలులు, పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల, ఇతర అధికారులు ఉన్నారు.

పెదవడ్లపూడిలో పునరావాస కేంద్రం ఏర్పాటు


పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ కిరణ్‌చంద్

మంగళగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రజల భద్రత నిమిత్తం మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని కల్యాణ మండపాన్ని తాత్కాలిక పునరావాస కేంద్రంగా మార్చి లోతట్టు ప్రాంతాల ప్రజలను అక్కడకు తరలించారు. పునరావాస కేంద్రంలో తాత్కాలిక వసతి, తాగునీరు, భోజనం వంటి మౌలిక సదుపాయాలను కల్పించారు. తుఫాన్ తీవ్రత నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, ఎంటీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ తెలిపారు. మంగళవారం పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించి బాధితులతో మాట్లాడారు. తుఫాన్ నుంచి రక్షణ పొందేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు ఎమ్మెల్యే సూచనలు


టెలికాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు వివరాలు అందిస్తున్న అధికారులు

మేడికొండూరు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు ముందు జాగ్రత్త చర్యగా లోతట్టు ప్రాంతాల వారిని, పొలాల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారిని మంగళవారం పునరావాస కేంద్రాలకు తరలించారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్‌లో అధికారులను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారికి మంచినీరు, భోజన వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా వరద ఉధృతి ఎక్కువగా ఉండే కొండవీటి వాగులో నీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఆయన మేడికొండూరు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి అయిన బీవీ నాగసాయికుమార్‌కు సూచనలు చేశారు. పాలడుగు గ్రామంలో ఎస్టీ కాలనీకి చెందిన 54మందిని, సిరిపురం పొలాల్లో ఉంటున్న 88మంది వలస కూలీలను, పేరేచర్ల బుడగ జంగాల కాలనీలోని సుమారు వంద మందిని, వెలవర్తిపాడులో 50మందిని పునరావాస కేంద్రాలను తరలించారు. గ్రామస్థాయి సిబ్బంది గ్రామంలోనే ఉండి మండలస్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు.

పునరావాస కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


అనంతవరప్పాడులోని పునరావాస కేంద్రంలో కుటుంబాలను పరామర్శిస్తూ అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

కాకుమాను/ప్రత్తిపాడు/వట్టిచెరుకూరు/పెదనందిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పలు పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మంగళవారం పరిశీలించారు. నియోజకవర్గంలోని కాకుమాను ఎస్సీ బాలుర వసతి గృహం, ప్రత్తిపాడులోని జడ్పీ పాఠశాల, అనంతవరప్పాడు, గారపాడు గ్రామంల్లోని జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పరిశీలించారు. అక్కడున్న వారికి ఆయనే స్వయంగా అన్నం వడ్డించి అక్కడ వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో పునరావాస కేంద్రాలలో ఉండే నిర్వాసితులకు అవసరమైన ఆహారం, నీరు, అందుబాటులో ఉండే విధంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సాధారణ పరిస్థితులు వచ్చే వరకు వసతి గృహంలోనే ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కాలువల్లో పూడిక తీయకపోవడం, డ్రెయిన్లు సరిగ్గా లేకపోవడం వల్లే తాము పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వస్తోందని పలువురు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. కాకుమాను మండల పరిధిలోని కొండపాటూరు శివారు నల్లమడ, కొమ్మమూరు కాలువ ప్రవాహాల కోసం ఏర్పాటు చేసిన తూముల వద్ద మట్టి పూడికతో నీటి పారుదల లేదని పలువురు రైతులు ఎమ్మెల్యేకు తెలిపారు. రేటూరు శివారు జిల్లెళమూడి వాగుకు వెళ్లే కాలువలో పూడికతో నీరు వెళ్లే అవకాశాలు లేవని రేటూరు గ్రామానికి చెందిన పలువురు తెలిపారు. వీరి సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు, సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన పనులు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కొల్లా వీరయ్య చౌదరి, తహసీల్దార్లు వెంకట స్వామి, క్షమారాణి, ఎంపీడీవోలు యుగకీర్తి, రమేశ్‌బాబు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులు, ఏఈ రవీంద్రరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ రమేశ్, ఏఈ రమేశ్, డ్రైనేజ్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● అధికారులతో సమీక్ష

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అధికారులతో జరిగిన సమీక్షలో అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తుఫాన్ నేపథ్యంలో ప్రతి అధికారి గ్రామాలలోనే ఉండాలన్నారు. గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకూడదని విద్యుత్ అధికారులకు ఆదేశించారు. గ్రామాలలో నీటి సరఫరా కూడా అంతరాయం లేకుండా నిర్వహించాలన్నారు. అలాగే డ్రైనేజీ, ఇరిగేషన్ అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నల్లమడ వాగు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున తక్షణమే ఏర్పాట్లు చేయాలని అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాలో నివాసం ఉండే వారిని పునరావాస కేంద్రాలను తరలించి వారికి వసతులు కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల తహసీల్దార్లు హేనప్రియ, ఎంపీడీవోలు, ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు) ,అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా నల్లపాడు, లయోలా పాఠశాల, బుడంపాడులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే రామాంజనేయులు పరిశీలించారు. ప్రజలకు అందజేస్తున్న తాగునీరు, ఆహారం, వైద్యం వంటి సౌకర్యాలపై అధికారుల నుంచి వివరాల అడిగీ తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రూరల్ మండలపరిధిలో వెంగళాయపాలెంలోని పూలేనగర్, ఇతర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు

● అధికార యంత్రాంగం అప్రమత్తం : సబ్ కలెక్టర్

దుగ్గిరాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో ఎలాంటి ప్రాణనష్టం జరుగుకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా తెలిపారు. పల్లపు ప్రదేశాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని ఆమె చెప్పారు. మండలంలోని ఈమని గ్రామంలో పునరావాస కేంద్రాలను సబ్‌కలెక్టర్ తనిఖీ చేశారు. తుఫాన్ ప్రభావం ఎక్కడున్నట్లు కనుగొన్నా, తక్షణమే వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు స్కూలు బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి టి.నరసింహారెడ్డి, తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులతో కలిసి వచ్చిన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు, గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు, సమీప ప్రభుత్వవైద్యశాలలకు తరలించామన్నారు. సోమవారం సాయంత్రం నుంచే పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారికి భోజనం, బస ఏర్పాటు చేశామని, పిల్లలకు పాలు, అల్పాహారం ఏర్పాటు చేశామని చెప్పారు. టీడీపీ నాయకుడు అంచే మారుతీవరప్రసాద్, జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు తదితరులతో కలిసి చెన్నకేశవనగర్, చిలువూరు గ్రామాల్లో పర్యటించి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు.


పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న పేదలు

నష్టం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు : తహసీల్దార్

తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ ఐ.సునీత చెప్పారు. మంగళవారం ఆమె దుగ్గిరాల, చిలువూరు, పెదకొండూరు, పేరుకలపూడి, ఈమని గ్రామాల్లో పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ, తుఫాన్ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో అధిక వర్షాలతో ముంపుబారిన పడిన, చెన్నకేశవనగర్, ఈమని, పెదకొండూరు చిలువూరు గ్రామాల్లో పలు కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. వైద్యసిబ్బందితో శిబిరాలు ఏర్పాటు చేశామని తహసీల్దార్ చెప్పారు.

మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా వెంకటరెడ్డి


చిలుకూరు వెంకటరెడ్డి

తుళ్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తాడికొండ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా వడ్డమానుకు చెందిన చిలుకూరి వెంకటరెడ్డి నియమితులయ్యారు. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పజెప్పిన తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌కు, తుళ్లూరు మండల టీడీపీ నాయకులకు ఈ సందర్భంగా వెంకటరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గత పది సంవత్సరాల నుంచి వెంకటరెడ్డి టీడీపీ పార్టీకి సేవలందిస్తూ వస్తున్నారు. అమరావతి ఉద్యమంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. కాగా జనసేన పార్టీ టీడీపీ పొత్తులో భాగంగా తుళ్లూరుకు చెందిన బేతు సురేంద్రకు డైరెక్టర్ పదవి లభించింది.

పునరావాస కేంద్రంలో ఆహారం పంపిణీ


తాడికొండ పునరావాస కేంద్రంలో బాధితులకు ఆహారం అందిస్తున్న ప్రత్యేక అధికారి మురళీధర్

తాడికొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రానికి తరలివచ్చిన బాధితులకు అధికారులు భోజనం, స్నాక్స్, ఇతర నిత్యావసరాలను ఏర్పాటు చేశారు. గుంటూరు ఆర్‌డీవో శ్రీనివాసరావులు పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. తాడికొండకు ప్రత్యేక అధికారిగా గుంటూరు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను నియమించగా ఆయన బాధితులను పరామర్శించి ఇబ్బందులు ఏమైన ఉంటే తమకు తెలియజేయాలని చెప్పారు. అధికారులు నిరంతరం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మెహర్‌కుమార్, సీఐ కే.వాసు, ఎంపీడీవో సమతావాణి, ఆర్‌ఐ నూతలపాటి హనుమంతరావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

మంగళగిరి సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వీవర్స్ కాలనీ మునిసిపల్ హైస్కూల్, కొత్తపేట బీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాల, హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో పేద కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. బాధితులకు తక్షణ సాయంగా రూ.60 వేల వ్యయంతో 300 మందికి దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేసినట్టు రెడ్‌క్రాస్ సొసైటీ సబ్‌బ్రాంచి చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి ఉపశాఖ వైస్‌చైర్మన్ గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శి అందె మురళీమోహనరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోయిన పేదలను ఆదుకోవాలి

మంగళగిరి సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, అసంఘటిత రంగ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళగిరి మండలం ఆత్మకూరు నిమ్మగడ్డ రామమోహనరావు కాలనీలో మంగళవారం ఆయన స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. భారీ వర్షాల వల్ల పనులు కోల్పోయిన వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

రాయల్ పబ్లిక్ స్కూల్లో పునరావాస కేంద్రం


పునరావాస కేంద్రం వద్ద ప్రభుత్వ ఆశాలు, వైద్య సిబ్బంది, బాధితులు


తాడేపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం నులకపేటలోని ఎమ్మెల్యే రామయ్య కాలనీ, ఫారెస్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు తుపాను వల్ల ఇబ్బందులు కలుగకుండా స్థానిక రాయల్ పబ్లిక్ స్కూల్‌లో అధికారులు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలెవరూ బయటకు వెళ్లొద్దని సూచించారు. భోజనంతోపాటు అన్ని వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పునరావాస కేంద్రాన్ని సీపీఎం నేతలు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు తదితరులు సందర్శించి వసతుల గురించి ఆరా తీశారు. పీహెచ్‌సి సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు పునరావాస కేంద్రంలో సహాయక చర్యలు చేపడుతున్నారు. మెడికల్ క్యాంప్ కూడా ఏర్పాటు చేశారు. యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మానసమంజరి సిబ్బందికి పలుసూచనలు చేశారు. కాగా, రామయ్య కాలనీలో నీరు బయటకు పోయే విధంగా సైడు కాలువలు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, నీరు బయటకు వెళ్లేందుకు అదనపు మోటర్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు.

క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలి

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేశ్

కాకుమాను, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని గ్రామీణనీటి సరఫరాశాఖ డీఈ రమేశ్ సూచించారు. కాకుమానులో పీడబ్ల్యూఎస్‌ను ఆయన ఏఈతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. అవసరమైతే జనరేటర్ సహాయంతోనే నీటిని సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెరువు చుట్టూ పరిశుభ్రమైన వాతావరారణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పైప్‌ల లీకేజ్ సమస్యలు ఉంటే వెంటనే కుళాయిలకు సీల్ వేయాలని పంచాయతీ కార్యదర్శి రమణయ్యకు సూచించారు. ఆయన వెంట డీఏ అఖిల్ ఉన్నారు.

సుప్రీంకోర్టు న్యాయవాది రవి కన్నుమూత


రంగిశెట్టి రవి (ఫైల్)

మంగళగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణం కొత్తపేటకు చెందిన మాజీ రాజకీయ నాయకుడు, సీపీఐ నేత రంగిశెట్టి కోటేశ్వరరావు పెద్ద కుమారుడు రంగిశెట్టి రవి (55) మంగళవారం ఢిల్లీలో గుండెపోటుతో కన్నుమూశారు. మంగళగిరికి చెందిన న్యాయవాది రవి సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. రంగిశెట్టి రవి మృతికి పలువురు న్యాయవాదులు, స్థానికులు, సీపీఐ నేతలు సంతాపాన్ని ప్రకటించారు. మంగళవారం రాత్రికి ఢిల్లీ నుంచి రవి భౌతికకాయాన్ని మంగళగిరికి తీసుకురానున్నట్టు ఆయన సన్నిహితులు తెలిపారు.

మూడు రోజులు అప్రమత్తంగా ఉండండి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్


పునరావాస కేంద్రాల్లోని వారికి దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన వెంకటపాలెం, తాళ్లాయపాలెం, రాయపూడి పాఠశాలలో ఏర్పాటు చేసిన మత్స్యకారులు, లంకవాసుల పునరావాస కేంద్రాలను సందర్శించి వారితో మాట్లాడారు. స్వచ్ఛమైన తాగునీరు, ఆహారం, వైద్యశిబిరం అందుబాటులో ఉండాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, జనసేన, టీడీపీ మండల అధ్యక్షులు యర్రగొపు నాగరాజు, ధనేకుల సుబ్బారావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, నాయకులు మూల్పూరి శ్రీనివాసరావు, సాహెబ్ జాన్, ఎంపీడీవో శిల్ప, తహసీల్దార్ హరిబాబు, సీఐలు కొంకా శ్రీనివాసరావు, మాతంగి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. పునరావాస కేంద్రాల్లో దుప్పట్లు, చాపలు అందజేశారు.

అధికారులతో టెలికాన్ఫరెన్స్

తాడికొండ: మొంథా తుఫాన్ వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు, టీడీపీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ సూచించారు. మంగళవారం నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ చేపట్టారు. రెవెన్యూ, విద్యుత్‌శాఖ, వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో ప్రజలకు తుఫాన్ పట్ల అప్రమతంగా ఉండేలా, అవగాహన కల్పించాలని సూచించారు. ఏదైన ఇబ్బందులు తలెత్తితే తనను సంప్రదించాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఎదురైతే మండలాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ సంప్రదించాలని తెలియజేశారు. తుళ్లూరు 90305 82479, తాడికొండ 9849364490, మేడికొండూరు 9949098615, ఫిరంగిపురం 9949098620 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

నిర్వాసితులకు ఎస్పీ పండ్లు పంపిణీ

● వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన


పునరావాస కేంద్రంలో బాలింతకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

కాకుమాను(గరికపాడు)/ప్రత్తిపాడు/పెదనందిపాడు: అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంనేందుకు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. కాకుమాను మండల పరిధిలోని గరికపాడు, ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం ఎస్పీ పరిశీలించారు. నిర్వాసితులతో మాట్లాడి వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, విపత్తుల సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎస్పీ వెంట సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెదనందిపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్ఐ మధు పవన్‌కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీబీసీ అళహరి శ్రీనివాస్, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మధుపవన్, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో దుప్పట్ల పంపిణీ


వడ్డేశ్వరంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత కాట్రగడ్డ మధుసూదనరావు, అసిస్టెంట్ కమిషనర్ శకుంతల

తాడేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో తుఫాన్ ప్రభావం వల్ల లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న 83 మంది పేదలను గుర్తించి వారికి టీడీపీ సీనియర్ నాయకుడు కాట్రగడ్డ మధుసూదన రావు అధికారులతో కలిసి దుప్పట్లు, కండువాలు సొంతగా పంపిణీ చేశారు. బిస్కెట్లు, పాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ, ఇటువంటి విపత్కర సమయాల్లో ఆపన్నులను ఆదుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరేంద్రబాబు, తహసీల్దార్ డి.సీతారామయ్య, గ్రామ రెవెన్యూ అధికారి సుభాషిణిబాయి, కామినేని సాంబశివరావు, షేక్ ఇమాంసా, జనసేన నేత వి.సాయి, జోరుగ దాసు, సచివాలయ సిబ్బంది ఏఎన్ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు. కాట్రగడ్డ మధుసూదనరావు జనరేటర్‌ను కూడా పునరావాస కేంద్రం వద్ద అందుబాటులో ఉంచారు.

టీడీపీ భోజన ఏర్పాట్లు


షాదీఖానా పునరావాస కేంద్రంలో భోజనాలు వడ్డిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

దుగ్గిరాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల చెన్నకేశవ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, జామువానగర్ చర్చి, ముర్తుజానగర్ షాదీఖానాలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తలదాచుకునే వారందరికీ టీడీపీ నేతలు భోజన వసతి ఏర్పాట్లు చేశారు. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గూడూరు వెంకట్రావు, టీఎన్‌యూఎస్ అధ్యక్షు డు వల్లూరు నరసింహారావు, దోస్త్ సభ్యుడు గద్దె శ్రీనివాస్, నక్కా చిరంజీవి, పర్వతనేని హర్షవర్ధన్, పఠాన్ జున్నూఖాన్ తదితరులు భోజనం వడ్డింపుల్లో పాల్గొన్నారు. పలువురు స్థానిక నాయకులతోపాటు ప్రత్యేక అధికారి టి.నరసింహారెడ్డి, తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, పంచాయతీకార్యదర్శి కె.వివేకానంద, పీఏస్సై బి.హరికృష్ణ పలువురు పంచాయతీరాజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్‌మనీ వేధింపులతో మహిళ ఆత్మహత్య


సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న శేషమ్మ

మడికొండూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాల్ మనీ వేధింపులు తట్టుకోలేక గుంటూరు పశ్చిమ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన ఈపూరి శేషమ్మ (42) అనే మహిళ మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో తన బలవన్మరణానికి పద్మ ఆమె చెల్లెలు సీత, ఈపూరు రమేశ్, కర్లపూడి శ్రీను అనే వ్యక్తుల వేధింపులే కారణమని పేర్కొంది. తాను రమేశ్‌కు పరిచయమున్న తురకపాలెంకు చెందిన వ్యక్తి నుంచి అప్పు తీసుకొని దాం ట్లో రూ.లక్షన్నరకు పైగా చెల్లించానని, అయినప్పటికీ తనపై కోర్టులో కేసు వేసి ఇబ్బందుల పాలు చేశాడని ఆరోపించింది. తాను బాకీ తీరుస్తానని చెప్పినప్పటికీ వినకుండా నిత్యం తనను తీవ్రంగా వేధిస్తున్నారని, అది తట్టుకోలేకే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియోలో వివరించింది. తన పిల్లలు జాగ్రత్తగా ఉండాలని కోరింది. ఇదిలా ఉండగా ఆత్మహత్యకు ముందు శేషమ్మ సెల్ఫీ వీడియోలో కర్లపాటి శ్రీను పేరును పొరపాటున కల్లూరి శ్రీను అని పలి కింది. కల్లూరు శ్రీనివాసరావు (శ్రీను) టీడీపీ నాయకుడు కావడంతో ఆయన వేధింపుల వల్లే శేషమ్మ ఆత్మహత్య చేసుకుందని వైసీపీ వారు సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తెనాలిలో వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

తెనాలి క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ బజారులో గుట్టుగా సాగుతున్న వ్యభిచార గృహంపై వన్ టౌన్ పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ బజారు అర్బన్ హెల్త్ సెంటర్ వెనుక ప్రాంతంలో ఓ ఇంటిలో వ్యభిచారం జరుగుతుందని వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేయగా తెనాలికి చెందిన వ్యభిచార నిర్వాహకురాలు చావలి హైమావతి, విజయవాడకు చెందిన ఇద్దరు మహిళలు, తెనాలికి చెందిన ఒక మైనరు బాలిక, గరువుపాలెంకు చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మహిళలను, మైనర్ బాలికను స్వధార్ హోమ్‌కు తరలించినట్లు సీఐ నరసింహారావు తెలిపారు.

తెనాలి డివిజన్‌లో విద్యుత్ అంతరాయాలు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో గుంటూరు సర్కిల్ తెనాలి డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. ముఖ్యంగా తెనాలి డివిజన్ పరిధిలోని కొల్లిపర ప్రాంతాల్లో ఈదురు గాలులు, వర్షంతో వృక్షాలు నేలకొరిగి విద్యుత్ తీగలు, పోల్స్ నేలకొరగటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తెనాలి డివిజన్ ఈఈ అక్కల సత్యనారాయణ క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. విద్యుత్ అంతరాయాలు తలెత్తినా వెంటనే పునరుద్ధరించేలా క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం రాత్రి వీచిన గాలులతో కొల్లిపర మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

తాటిచెట్టు పడి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

చేబ్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):చేబ్రోలు మండల పరిధిలోని శేకూరు-వీరనాయకునిపాలెం గ్రామాల మధ్య బలమైన ఈదురు గాలులకు తాటిచెట్టు కూలిపోవడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఫలితంగా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే విద్యుత్‌శాఖ సిబ్బంది వేగంగా స్పందించి, పాడైన స్తంభాలను సరిచేసి సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వీరనాయకునిపాలెంలోని లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరుకొనే అవకాశం ఉన్నందున వారిని పునరావాస కేంద్రాలకు తరలిరావాలని వీరనాయకునిపాలెం పంచాయతీ సెక్రటరీ డి.సుజన సూచించారు. కొంత మంది బాధితులు రాత్రి 8గంటల సమయంలో రావడంతో వారికి గ్రామంలోని పాఠశాల భవనానికి తరలించినట్లు ఆమె తెలిపారు. అకస్మికంగా వారు రావడంతో వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, వసతి వంటి సదుపాయాలను ఏర్పాటుచేశారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పర్యటించి తుఫాన్ ముప్పు నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఇంటి బయటకు అవసరం లేకుండా వెళ్లవద్దని సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకు అధికారులు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

గాలులతో వరి పైరుకు నష్టం

● తుఫాన్ ప్రభావంతో రోజంతా ఈదురు గాలులు ● చెదురు మదురుగా వర్షాలు



పొన్నూరు: ఈదురు గాలులకు నేల వాలిన వరి పైరు

పొన్నూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం పొన్నూరు మండలంపై తీవ్రంగానే పడింది. తుఫాను ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి మండలంలో ఈదురు గాలులు వీచటం ప్రారంభమైంది. ఈదురు గాలుల ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగాయి. తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలుల తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ వర్షం మాత్రం చెదురుమదురుగా పడటంతో కొంతమేర ఉపశమనం కలిగింది. వర్షం భారీగా కురవనప్పటికీ ఈదురు గాలులు అధికంగా వీచటంతో వరి పైరు నేలకు ఒరిగి నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా మండలంలో పలు గ్రామాల్లో వాణిజ్య పంటలు తమలపాకు, అరటి సాగు చేస్తున్నారు. వందల ఎకరాలలో వాణిజ్య పంటల సైతం ఈదురుగాలుల ప్రభావంతో నేలకు ఒరిగి పంట నష్టం తప్పదని అన్నదాతల్లో ఆవేదన వ్యక్తం అవుతోంది.

ఆందోళనలో రైతన్నలు

కొల్లిపర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. గాలులతో కూడిన భారీ వర్షం పడితే వాణిజ్య పంటలైన పసుపు, కంద, అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బ దెబ్బతింటాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో కొల్లిపర మండలంలో పలు చోట్ల వరి పంట చెల్లాచెదురు అయ్యి నేలవాలింది. పలు గ్రామాల్లో వరి పంట నేలవాలటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మెట్ట భూముల్లో వేసిన కంద, అరటి, బొప్పాయి తోటలు గాలికి పడిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



కొల్లిపరలో గాలికి పడిపోయిన అరటి తోట

స్తంభించిన జనజీవనం

● నిర్మానుష్యంగా మార్కెట్, ప్రధాన రహదారులు

● చెట్ల కొమ్మల తొలగింపు ● మార్కెట్లలో తహసీల్దారు తనిఖీ



మార్కెట్‌లో తగ్గిన జనసంచారం, నిర్మానుష్యంగా ఉన్న విజయవాడ రోడ్డు

తెనాలి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా పట్టణంలో రూరల్ మండల గ్రామాల్లో జన జీవనం స్తంభించింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వానలు పడుతూనే ఉన్నాయి. తుఫాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అందుకు తగిన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమయ్యారు. తుఫాన్ వలన ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పర్యటించి కొమ్మలను తొలగించారు. ఫ్లెక్సీ హోర్డింగ్‌లు కూడా తొలగించడంతో పాటు నిర్మాణంలో ఉన్న భవనాలకు ఎలివేషన్ కోసం చేసిన ఏర్పాట్లను కూడా తొలగించారు. రైతు బజారులో ధరలు ఎక్కువ చేశారని, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు ఫిర్యాదు అందడంతో ఆయన రైతు బజారుతో పాటు నిత్యావసరాలు విక్రయించే దుకాణాలను కూడా తనిఖీ చేశారు. తుఫాన్‌ను ఆసరాగా తీసుకుని వ్యాపారులు, రైతు బజార్లు, పాలబూత్‌లు ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ మండల గ్రామాల్లో తుఫాన్‌కు ఇబ్బంది పడే ప్రజలను గుర్తించి కొలకలూరులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలిస్తున్నామన్నారు. వారికి అక్కడ భోజనం, వసతులుకల్పిస్తున్నామని చెప్పారు. బోసురోడ్డులోని రైతు బజారు పరిస్థితిని చూసి వర్షాల అనంతరం సమావేశాలు ఏర్పాటుచేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆదేశిస్తున్నారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పలు ప్రధాన ప్రాంతాల్లో తుఫాన్ నేపథ్యంలో తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు.



రైతుబజారులో తనిఖీచేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



పొన్నూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం గుంటూరు జిల్లాపై అధికంగా ఉంటుందనే వార్తల నేపథ్యంలో పొన్నూరులో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశించారు. సహాయ చర్యల మీద మంగళవారం ఆయన తహసీల్దార్లు, ఎంపీడీవోలు పలు ప్రభుత్వ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాధ్యమైనంత వరకు పంట నష్టం జరగకుండా అధికారులు నీటి పారుదల సౌకర్యాలపై జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో కంట్రోల్ రూములు ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను పునరావాస కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో నివాసముంటున్న ప్రజలకు భోజన వసతి వైద్య సదుపాయాలను అందించాలన్నారు. సముద్ర తీర ప్రాంతానికి దగ్గరగా ఉన్న పొన్నూరు మండలంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కాలువలకు గండ్లుపడే ప్రదేశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీరు పంట పొలాల్లోకి రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. అలాగే విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆదేశించారు.

యాజమాన్య పద్ధతులపై అధికారుల సూచనలు

చేబ్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో వ్యవసాయాధికారిణి ప్రియదర్శిని రైతులను కలసి తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అనుసరించవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు. పొలాల్లో నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించి, ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలన్నారు. పొడి తెగులు నివారణకు లీటర్ నీటికి 1 మి.లీ. ప్రోపికోనాజోల్ లేదా 2 మి.లీ. హెక్సాకోనాజోల్ పిచికారి చేయవచ్చని చెప్పారు. అగ్గి తెగులు, మానుకాయ తెగులువంటి వ్యాధుల నివారణకు కూడా ఇదే మోతాదులో మందులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వరి పైరుపై ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి

● ఏడీఏ రామకోటేశ్వరి

పొన్నూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో నేలకు ఒరిగిన వరి పైరుపై ఉప్పు ద్రావణం పిచికారి చేయడం వల్ల మొలక రాకుండా ఉంటుందని ఏడీఏ వీ రామకోటేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని వెల్లలూరు, పచ్చలతాడిపర్రు, దండమూడి, వల్లభరావుపాలెం, సీతారాంపురం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అత్యధిక మంది రైతులు బీపీటీ 5204 రకం సాగు చేశారన్నారు. ఈ రకం వరి విత్తనాలకు నిద్రావస్థ లేనందువలన నీటిలో నానిన తరువాత మొలక వస్తుందని హెచ్చరించారు. వర్షం తగ్గిన వెంటనే రైతులు ఎకరాకు రెండు కేజీల రాతి ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. దీనివలన రంగు మారదని తెలిపారు. పడిపోయిన వరి పైరు మూడు, నాలుగు దుబ్బులు కలిపి కట్టడం వలన పైరు కాపాడుకోవచ్చని తెలిపారు. నీరు బయటకు వెళ్లిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా 20కిలోల పొటాష్ ఎరువును పిచికారి చేయాలన్నారు. బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు వచ్చే లక్షణాలు ఉన్న నేపథ్యంలో సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఆరు వెంకటేశ్వరరావు, విస్తరణ అధికారి ఐ శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



పెదకాకాని సర్వీస్ రోడ్డులో ఉన్న భవనం తొలగింపును పరిశీలిస్తున్న అధికారి

పెదకాకానిలో భవనం తొలగింపునకు చర్యలు

● ప్రమాదకరంగా కుంచించుకుని ఉన్న సర్వీస్ రోడ్డు

పెదకాకాని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని సెంటర్ సమీపంలో హైవేపై ఒక భవనం అడ్డంగా ఉంది. హైవే విస్తరణలో భాగంగా చేపట్టిన రోడ్డు పనులు అప్పట్లో అరకొరగా సాగాయి. పెదకాకాని ప్రధాన కూడలికి సమీపంలోని ఒక భవనం రోడ్డుకు అడ్డంగా ఉంది. దీంతో హైవే కుచించుకుపోవడంతో నిత్యం అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మే 29వ తేదీన ఆంధ్రజ్యోతి గుంటూరు జిల్లా సంచికలో 'ఆ ప్రాంతం.... యమ డేంజర్ అంటూ వార్తను ప్రచురించిన సంగతి పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన అధికారులు నేషనల్ హైవే అథారిటీ, వివిధ శాఖల అధికారులు నివేదికలు తెప్పించుకొని పరిశీలించి ఎట్టకేలకు ఈ భవన తొలగింపు పనులు చేపట్టారు. దీనిని తొలగించిన అనంతరం రహదారిని విస్తరించి ప్రమాదాలు నివారించాలని పెదకాకాని గ్రామస్థులు కోరుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జడ్పీ విద్యార్థి ప్రతిభ

పొన్నూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పచ్చలతాడిపర్రు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీబీఎస్ బసవయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ పచ్చలతాడిర్రులో విద్యార్థినికి అభినందన కార్యక్రమం జరిగింది. ఈ నెల 24 నుంచి దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో జరిగిన ఎస్‌జీటీ స్టేట్ మీట్ పోటీలలో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో పచ్చలతాడిపర్రు పాఠశాలకు చెందిన కే లాస్య, 69 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. లాస్యను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు సరళ దేవి, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినితో వ్యాయామ ఉపాధ్యాయురాలు

పునరావాస కేంద్రాల ఏర్పాటు

● తుఫాన్ పర్యవేక్షణకు బృందాలు



తెనాలి పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ రాధిక, కమిషనర్ అప్పలనాయుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తుఫాన్ బాధితుల కోసం పది పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొంథా తుఫాన్ ఎదుర్కొనేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ అప్పలనాయుడు, అధికారులు పట్టణంలో మంగళవారం పర్యటించారు. పలు ప్రాంతాల్లో ప్రజలను తుఫాన్ జాగ్రత్తలపై అప్రమత్తం చేశారు. నాలుగు కేంద్రాలకు 115 మందిని తరలించారు. పట్టణంలోని ప్రైవేట్ స్కూల్‌కు సంబంధించిన ఏడు బస్సులను తీసుకుని పట్టణమంతా గాలించి తుఫాన్‌కు ఇబ్బందిపడే ప్రజలను వాటిలో కేంద్రాలకు తరలిస్తున్నారు. తులసీదాసు కమ్యూనిటీ హాలు, కోటేశ్వరరావు కల్యాణ మండపం, ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్, ఎన్టీఆర్ కమ్యూనిటీ హాలు, చైతన్య స్కూల్ వంటి పలు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి వార్డు సచివాలయంలో రిలీఫ్ సెంటర్‌ను నిర్వహించాలని 24గంటల పాటు సచివాలయం తెరచి ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు గాను 500 కేవీ సామర్థ్యం కలిగిన జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. భారీవర్షం కారణంగా మురుగు కాల్వలు, రహదారులు ఏకమయ్యే అవకాశాలు దృష్టిలో ఉంచుకుని నీటిని త్వరితగతిన తరలించేందుకు ఐదు భారీ మోటార్లను పూలేకాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ వంటి పలు చోట్ల ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. నాలుగు జేసీబీలతో అన్ని డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగించి వాననీటి పారుదలకు అవరోధాలు లేకుండా చూస్తున్నారు. ర్యాపిడ్ టీమ్ ఏర్పాటుచేసి విద్యుత్ తీగలపై పడటానికి అవకాశం ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. తుఫాన్ మంగళవారం రాత్రికి తీరం చేరి భారీ వర్షం, గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పట్టణంలో ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్ ఫ్రీ నెం.1800 455 6468లో తెలియజేయాలని సూచించారు. మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, సిటీ ప్లానర్ శివన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మొవ్వా ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలులో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పొన్నూరులో 650 మంది తరలింపు

పొన్నూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం బారినపడే అవకాశం ఉన్న 650 మందిని అధికారులు మంగళవారం పునరావాస కేంద్రాలకు తరలించారు. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్, డీవీసీ కాలనీ పాఠశాల, మండల పరిధిలోని పలు పాఠశాలలో అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. పొన్నూరు పట్టణంలో పలు కాలనీలో పూరి గుడిసెలు, బలహీన గృహాల్లో ఉన్న వారిని తుపాను ప్రభావం బారిన పడకుండా అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. పట్టణంలోని రెండు కేంద్రాలలో సుమారు 500మందికి అధికారులు ఆశ్రయం కల్పించారు. అలాగే మండల పరిధిలోని పెదఇటికంపాడులో 12మందిని, వల్లభరావుపాలెంలో 82మందిని, ఉప్పరపాలెంలో 58మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి అధికారులు అల్పాహారం, భోజనం సౌకర్యాలను కల్పించారు.



పొన్నూరు పునరావాస కేంద్రంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

కొల్లిపర మండలంలో 500మంది ..

కొల్లిపర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్‌ఐ కోటేశ్వరావు లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలోని వల్లభాపురం, తూములూరు, అత్తోట, దంతలూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో 500 మందిని తరలించి తగిన సౌకర్యాలు కల్పించారు. సాయంత్రం నుంచి ఈదురు గాలుల వేగం పెరగటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో మండలంలోని గ్రామాల్లో దుకాణాలు మూతపడ్డాయి. రోడ్ల వెంట జనసంచారం తగ్గింది.

చేబ్రోలులో 2 పునరావాస కేంద్రాల ఏర్పాటు

చేబ్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో చేబ్రోలు మండల అధికారులు అప్రమత్తమయ్యారు. పలు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, వాటిలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. మండలంలో 2 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశారు. వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గరువుపాలెంలోని సంఘం జాగర్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కేంద్రాలను ఏర్పాటుచేసి, స్థానికులను అక్కడకు తరలించారు. వేజండ్ల పరిసర గ్రామాల నుంచి 50 మంది, వడ్లమూడి, గరువుపాలెం ప్రాంతాలనుండి 227 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ శ్రీనివాసశర్మ తెలిపారు. మండల ప్రత్యేక అధికారిణి ఏ జయలక్ష్మి మంగళవారం ఈ పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అలాగే ప్రసవ సమయం దగ్గర ఉన్న ముగ్గురు గర్భిణులను చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముందస్తు చర్యగా తరలించామని తెలిపారు.



నంబూరు పునరావాస కేంద్రంలో ఏర్పాటుచేసిన భోజన సదుపాయాలు

వసతులను పరిశీలించిన ప్రత్యేక అధికారిణి

చేబ్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రత దృష్ట్యా మండలంలోని పంచాయతీల పరిధిలో పునరావాస కేంద్రాలను పెంచుతున్నట్లు జాయింట్ డిపార్ట్మెంట్, మండల ప్రత్యేక అధికారి ఏ.జయలక్ష్మి తెలిపారు. చేబ్రోలు గ్రామంలో 20మందిని, మంచాల గ్రామంలో 52మందిని, వేజండ్లలో 32, వడ్లమూడిలో 225, మొత్తం 327మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు జయలక్ష్మి తెలిపారు. వీరిలో సాధారణ వ్యక్తులతో పాటు, గర్భిణులు, బాలింతలు, వయోవృద్ధులు, దివ్యాంగులు, సంవత్సరంలోపు చిన్నపిల్లలు ఉన్నారని చెప్పారు. వీరికి ప్రథమచికిత్స, అత్యవసర సేవలు అందించేందుకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ఇబ్బందికరమైన అనారోగ్యపరిస్థితులు ఏర్పడితే వెంటనే 108ద్వారా చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా హయ్యర్ సెంటర్‌కు రిఫర్ చేయడం జరుగుతుందని అన్నారు. 24/7 అధికారులు పునరావాస కేంద్రాలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

పెదకాకాని మండలంలో నాలుగు కేంద్రాలు

పెదకాకాని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలంలో నాలుగు చోట్ల పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశారు. తుఫాన్ నేపథ్యంలో వందలాది మంది నిర్వాసితులను గుర్తించి వారందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పెదకాకాని, నంబూరు, ఉప్పలపాడు, వెనిగండ్ల గ్రామంలో ఆయా పునరావాస కేంద్రాలలో భోజన సదుపాయాన్ని కల్పించారు. లోతట్టు ప్రాంతాలు, ఇల్లు లేని పేదలు, పూరిళ్లలో ఉన్ననిరుపేదలందరినీ సమీపంలోని పునరావాస కేంద్రలకు తరలించారు. పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్, ఎంపీడీవో శ్రీనివాసరావులు ప్రత్యేక చొర చూపి గ్రామ పంచాయతీల కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ పునరావాస కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు.



కొల్లిపర మండలం తూములూరు పునరావాస కేంద్రంలో గ్రామస్థులకు భోజన ఏర్పాట్లు చేసిన అధికారులు

జిల్లాలో 116 పునరావాస కేంద్రాలు

● 7265 మంది తరలింపు ● భోజన సదుపాయాలు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. పటిష్టంగా ఉన్న జిల్లాపరిషత్తు హైస్కూళ్లు, గ్రామ, వార్డు సచివాలయాల భవనాలు, ఫంక్షన్ హాల్స్‌లో వీటిని ప్రారంభించింది. తుపాను కారణంగా కూలిపోయే అవకాశం ఉన్న కచ్చాఇళ్లు, నీట మునిగే ప్రమాదం ఉన్న లోతట్టు ప్రాంతాలను అధికారులు గుర్తించి అక్కడ నివాసం ఉంటున్న వారిని కేంద్రాలకు తరలించారు. పునరావాస కేంద్రాలు దూరంగా ఉన్న ప్రాంతాల్లో అయితే ఆర్‌టీసీ బస్సులు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి తీసుకొచ్చారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృతంగా పర్యటిస్తూ పునరావాస కేంద్రాలను సందర్శించి అక్కడి ప్రజలకు ధైర్యం చెప్పారు.

జిల్లాలో మొత్తం 13,240 కచ్చా గృహాలను గుర్తించారు. ఎక్కువగా గుంటూరు నగరంలో 2699, పొన్నూరులో 1167, తెనాలిలో 1047 ఉన్నాయి. వాటిల్లో 13,887 కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు లెక్కించారు. తాత్కాలికంగా 596 ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేశారు. 51 చోట్ల కట్టడాలు కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు గ్రహించారు. గుంటూరు నగరంలో 25, దుగ్గిరాలలో 10, తుళ్లూరులో 10, ప్రత్తిపాడులో 4, వట్టిచెరుకూరులో 4, పెదనందిపాడులో 3, గుంటూరు తూర్పులో 1, గుంటూరు పశ్చిమలో 2, ఫిరంగిపురంలో 1, మేడికొండూరులో 4, తాడికొండలో 1, పెదకాకానిలో 4, చేబ్రోలులో 4, పొన్నూరులో 8, తెనాలిలో 1, కొల్లిపరలో 4, కాకుమానులో 6, మంగళగిరిలో 5, తాడేపల్లిలో 8, ఎంటీఎంసీలో 4, తెనాలి టౌన్‌లో 6, పొన్నూరు టౌన్‌లో 1 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటన్నింటిలోకి మంగళవారం సాయంత్రానికి 7265 మందిని తరలించి భోజన సదుపాయాలను కల్పించారు. ఎక్కువగా గుంటూరు నగరంలో 1840, పొన్నూరులో 650, తాడేపల్లిలో 502 మందిని సెంటర్స్‌కు తీసుకొచ్చారు. కాగా ఉదయం నుంచి జిల్లాలో పలుచోట్ల జోరుగా వర్షం కురిసి, ఈదురు గాలులు వీచాయి. తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్టణం జిల్లాలతో పాటు ఒడిస్సా రాష్ట్రానికి బయలుదేరి వచ్చిన సిమెంట్ లోడు లారీలు ఎన్‌హెచ్-5పై ఏటుకూరు బైపాసు వద్ద పార్కింగ్ స్థలాల్లో నిలిపేశారు. ఇతర సరుకుల వాహనాలను కూడా సురక్షిత ప్రాంతాల్లో పార్కింగ్ చేశారు. తుపాను గండం గడిచాక తాము బయలుదేరి వెళతామని ఆయన వాహనాల డ్రైవర్లు తెలిపారు.